మీరే
చదువరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త
వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU
దినపత్రిక

మీరే
విలేకరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని
వార్తలు పంపండి..

ఆదివారం
SUNDAY
4-1-2026

జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00
సంపుటి: 1 Volume:1 || సంచిక: 186 Issue: 186

04 జనవరి 2026 - ఆదివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - హేమంత ఋతువు పుష్య మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:51 సూర్యాస్తమయం - సా. 5:51 తిథి పాడ్యమి మ. 12:33 వరకు తరువాత విదియ సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం పునర్వసు మ. 3:13 వరకు తరువాత పుష్యమి యోగం వైధృతి రా. 1:41ం వరకు కరణం కౌలవ మ. 12:33 వరకు తైతుల రా. 11:13 వరకు వర్జ్యం రా. 10:35 నుండి రా. 12:04 వరకు దుర్ముహూర్తం సా. 4:22 నుండి సా. 5:06 వరకు రాహుకాలం సా. 4:28 నుండి సా. 5:51 వరకు యమగండం మ. 12:21 నుండి మ. 1:43 వరకు గుళికాకాలం మ. 3:06 నుండి సా. 4:28 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:15 నుండి ఉ. 6:03 వరకు అమృత ఘడియలు మ. 12:59 నుండి మ. 2:26 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:59 నుండి మ. 12:43 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున


Published from Jagitial
www.evarthalu.com



## నిద్రలోకి బీజేపీ ఎమ్మెల్యేలు

### ఉత్తమ్ ప్రజెంటేషన్ సమయంలో ఘటన

అసెంబ్లీలో శనివారం కృష్ణా నీళ్లపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న సందర్భంగా ఆసక్తికర ఘటన చోటుచేసుకున్నది. ఒకవైపు మంత్రి ఉత్తమ్‌కుమార్.. సీరియస్‌గా ప్రజెంటేషన్ ఇస్తుంటే, మరోవైపు బీజేపీ ఎమ్మెల్యేలు కునుకు తీశారు. 2



## లాబీల్లోకి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

### సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర అసహనం

ఎమ్మెల్యేలు సభలో ఉండకుండా లాబీల్లో తిరిగారు. ప్రభుత్వం ఒక కీలక అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తుంటే ఎమ్మెల్యేలు సభలో లేకపోవడం సరైన పద్ధతి కాదని సీఎం అభిప్రాయపడ్డారు. ఇలా వ్యవహరిస్తే ప్రభుత్వ ప్రతిష్ఠ దెబ్బతింటుందని అన్నారు. ప్రజలు సమావేశాలను గమనిస్తుంటారని, కాబట్టి ఎమ్మెల్యేలు అత్యంత బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. ఎమ్మెల్యేలు సభలో లేకపోవడం పార్టీ క్రమశిక్షణకు విరుద్ధమని ఆయన అన్నారు. 2



## తెలంగాణోళ్ల మనసు గొప్పదని అర్థమైందా?

### పవన్ తెలంగాణ పర్యటనపై ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

హైదరాబాద్, జనవరి 3 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ తెలంగాణ పర్యటనపై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి స్పందించారు. తెలంగాణ ప్రజల మనసు గొప్పదనే విషయం ఆయన ఇప్పటికైనా అర్థం చేసుకుంటారని భావిస్తున్నానని అన్నారు. ఆయన ఇప్పటికైనా దిగజారుడు వ్యాఖ్యలు మానుకుని తెలంగాణ స్థాయిని తెలుసుకోవాలని సూచించారు. తెలంగాణవాళ్లది నర దిష్టి -2 వ పేజీలో...



# ఈ ప్రాణం అంజన్నదే!

## పెను ప్రమాదం నుంచి కాపాడాడు

### తెలంగాణ నేల పోరాడే ధైర్యమిచ్చింది

### ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

మల్యాల, జనవరి 3 (ఈవార్తలు): ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్, తనకు కొండగట్టు ఆంజనేయ స్వామిపై ఉన్న భక్తిని మరోసారి చాటుకున్నారు. జగిత్యాల జిల్లాలో ఉన్న ఈ ప్రముఖ పుణ్యక్షేత్రాన్ని శనివారం సందర్శించిన ఆయన, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గతంలో జరిగిన ఓ పెను ప్రమాదం నుంచి తనను కొండగట్టు అంజన్నే కాపాడారని, ఇది తనకు పునర్జన్మ లాంటిదని భావోద్వేగంగా వ్యాఖ్యానించారు. 2009లో ప్రజారాజ్యం పార్టీ తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో, ఈ ప్రాంతంలోనే తరువాయి 2 వ పేజీలో...







'సభ పెట్టండి.. బట్టలుడతీస్తా. తోలు తీస్తా అన్నారు కదా.. తెలంగాణ రైతుల పట్ల తమ చిత్తశుద్ధిని ఎవరైనా ప్రశ్నిస్తే తోలు తీయడం కాదు నాలుక కోస్తా. చిన్న వయసులో దేవుడు నాకు పెద్ద బాధ్యత ఇచ్చాడు. దేవుడిపై ఆన.. సీఎం కుర్చీలో కూర్చున్నంత కాలం తెలంగాణ ప్రజల హక్కులకు భంగం కలగనివ్వ' అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

# నాలుక కోస్తా

### మా చిత్తశుద్ధిని ప్రశ్నిస్తే జాగ్రత్త.. నాకు చిన్న వయసులోనే పెద్ద బాధ్యత

### దేవుడిపై ఆన.. తెలంగాణ హక్కులకు భంగం కలగనివ్వ.. అసెంబ్లీలో రేవంత్

హైదరాబాద్, జనవరి 3 (ఈవార్తలు): శాసనసభ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్ష నేత, మాజీ సీఎం కేసీఆర్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'నీళ్లు-నిజాలు' అనే అంశంపై జరిగిన లఘుచర్చలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పాలమూరు జిల్లాకు అన్యాయం జరుగుతోందంటూ గతంలో కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను సీఎం గుర్తుచేశారు. 'ప్రభుత్వ తోలు తీస్తాం.. బట్టలిప్పుతాం.. అని వీరావేశంతో సవాళ్లు విసిరిన వాళ్లు ఇప్పుడు ఎక్కడికి పోయారు? ముఖాముఖి తేల్చుకుందాం రమ్మని అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేస్తే ఎందుకు ముఖం చాటేశారు?' అని రేవంత్ సూటిగా ప్రశ్నించారు. దమ్ముంటే సభకు వచ్చి మాట్లాడాలని, అంతేకానీ బయట ఉండి విమర్శలు చేయడం సరికాదని హితవు పలికారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ, ప్రత్యేక తెలంగాణలో గత పదేళ్లలోనూ మహబూబ్‌నగర్ జిల్లాకు తీరని అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణా జలాల అంశాన్ని తెరపైకి తెచ్చిందే కేసీఆర్ అని, తీరా చర్చ పెట్టగానే బీఆర్ఎస్ పార్టీ సభను బహిష్కరించడం సిగ్గుచేటని మండిపడ్డారు. దాదాపు 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న కేసీఆర్.. గత రెండేళ్లుగా అసెంబ్లీకి రాకపోవడం ప్రజాస్వామ్య వ్యవస్థనే అవమానించడమని రేవంత్ అభిప్రాయపడ్డారు. ప్రతిపక్ష నేతగా సభలో ఉండి ప్రభుత్వానికి విలువైన తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.13,582 |
| వెండి (గ్రాము): | రూ.257 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,204 |

# ఆరేళ్లలో 60 వేల కోట్ల స్వాహా

### ఆన్‌లైన్ మోసాలతో భారతీయులు బలి

### 2025లోనే రూ. 19,813 కోట్ల మేర నష్టం

### అత్యధికంగా మహారాష్ట్ర.. టాప్ 5లో తెలంగాణ

న్యూఢిల్లీ: దేశంలో సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు ప్రమాదకర స్థాయిలో పెరిగిపోతున్నాయి. గత ఆరేళ్లలో వివిధ రకాల మోసాల బారిన పడి భారతీయులు ఏకంగా రూ.52,976 కోట్లకు పైగా నష్టపోయినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ నివేదిక ప్రకారం, ఒక్క 2025లోనే దేశవ్యాప్తంగా రూ.19, 813 కోట్ల నష్టం వాటిల్లగా, 21.77 లక్షలకు పైగా ఫిర్యాదులు నమోదయ్యాయి. గతేడాది అత్యధికంగా నష్టపోయిన రాష్ట్రాల జాబితాలో మహారాష్ట్ర (రూ.3,203 కోట్లు) అగ్రస్థానంలో ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో కర్ణాటక (రూ.2,413 కోట్లు), తరువాయి 2 వ పేజీలో...




# పాలమూరుకు అనుమతులివ్వాలి

### ఏపీ గోదావరి జలాల తరలింపును అడ్డుకోండి

### అసెంబ్లీలో ప్రభుత్వం కీలక తీర్మానాలు

హైదరాబాద్, జనవరి 3 (ఈవార్తలు): అసెంబ్లీలో ప్రభుత్వం కీలక తీర్మానాలు చేసింది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కేంద్రం అన్ని అనుమతులు ఇవ్వాలని తీర్మానించింది. గోదావరి జలాల తరలింపునకు ఏపీకి కేంద్రం ఎలాంటి అనుమతులు ఇవ్వొద్దనీ తీర్మానం చేసింది. అంతకుముందు సభలో మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో ఒక పంపు ఆన్ చేసి ఆపేశారని మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. ఈ ప్రాజెక్టుపై బీఆర్ఎస్ రూ.26,262 కోట్లు ఖర్చుచేయగా అది మొత్తం అంచనాతో 32 శాతమే అని, అయినా ఇంకా 39 వేల ఎకరాల భూసేకరణ పెండింగ్‌లో ఉందని స్పష్టం చేశారు. 2016లో శంకుస్థాపన తరువాయి 2 వ పేజీలో...



## విశ్వవాణి



అమెరికాలోని నెవాడా ప్రాంతంలో రూ.135 లక్షల కోట్ల విలువ చేసే లిథియం నిక్షేపాలను కనుగొన్నారు. ఈ నిక్షేపాలు ప్రపంచవ్యాప్తంగా బ్యాటరీ పరిశ్రమకు గొప్ప వనరు అవుతుందని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.

# ప్రాణాలను తినేస్తోంది

### అత్యంత ప్రమాదకరంగా మెదడును తినే అమీబా

### వాతావరణ మార్పులు, పాత నీటి వ్యవస్థలే కారణం

న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా ప్రజారోగ్యానికి బ్రెయిన్ ఈటింగ్ అమీబా (మెదడును తినే అమీబా) ముప్పు అంతకంతకూ పెరుగుతోందని తాజా అధ్యయనం హెచ్చరిస్తోంది. వాతావరణ మార్పులు, పాతబడిన నీటి సరఫరా వ్యవస్థలు, పర్యవేక్షణలో లోపాల కారణంగా ఈ ప్రమాదకర సూక్ష్మజీవులు నీటిలో, పర్యావరణంలో విస్తరిస్తున్నాయని పర్యావరణ, ప్రజారోగ్య శాస్త్రవేత్తల బృందం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ అధ్యయన వివరాలు బయోకంటామినెంట్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. సాధారణంగా మట్టి, నీటిలో కనిపించే ఈ ఏకకణ జీవులను తరువాయి 2 వ పేజీలో...



## వెనెజులాపై అమెరికా అటాక్

### మిలిటరీ యాక్షన్ చేపట్టిన ట్రంప్

### కారకాస్‌లో ఏడు చోట్ల భారీ పేలుళ్లు

### బందీగా అధ్యక్షుడు మదురో, అతడి భార్య

### అమెరికా చర్య దుర్మార్గం: ఐక్యరాజ్యసమితి

కారకస్: వెనెజువెలాలో శనివారం తెల్లవారుజామున తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. రాజధాని కారకాస్‌తో పాటు పలు నగరాల్లో భారీ పేలుళ్లు సంభవించాయి. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కట్టడి పేరిట అగ్రరాజ్యం అమెరికా ఈ దాడులకు దిగింది. ట్రంప్ ఆదేశాలతోనే అమెరికా సైన్యం ఈ దాడులు చేసింది. కారకాస్‌లోని లా కార్లోటా సైనిక వైమానిక స్థావరం, ఫ్యూర్టే టియునా -2 వ పేజీలో...





## 14 మంది నక్సల్స్ హతం

బీజాపూర్/వైజాగ్, జనవరి 3 (ఈవార్తలు): ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి మావోయిస్టులపై భద్రతా బలగాలు విరుచుకుపడుతున్నాయి. బీజాపూర్ జిల్లా దక్షిణ అటవీ ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో 14 మంది -2 వ పేజీలో...

# రాశి ఫలాలు

4.1.2026

మేషం: ముఖ్యమైన వ్యవహారాలలో స్వంత ఆలోచనలు పనిచేయవు. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. సంతాన విషయంలో ఇతరులతో విభేదాలు కలుగుతాయి. విలువైన వస్తువులు విషయంలో జాగ్రత్త వహించాలి. వృత్తి వ్యాపారాలలో స్వల్ప లాభాలు అందుతాయి. ఉద్యోగస్తులకు అదనపు బాధ్యతలు తప్పవు.

వృషభం: ఆర్థిక పరిస్థితి గంధరగోళంగా ఉంటుంది. తల్లిదండ్రులు ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. అవసరానికి కుటుంబ సభ్యుల సహాయం లభించదు. వృత్తి వ్యాపారాలలో గందరగోళ పరిస్థితులుంటాయి. చేపట్టిన పనులలో అవరోధాలు కలుగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు మందకొడిగా సాగుతాయి.

మిధునం: విలువైన వస్త్ర ఆభరణాలు కొనుగోలు చేస్తారు. ఇంటాబయటా కీలక నిర్ణయాలను అమలు పరుస్తారు. ఆదాయ మార్గాలు విస్తృతమౌతాయి. వృత్తి ఉద్యోగాలలో శ్రమకు తగిన గుర్తింపు లభిస్తుంది. వ్యాపారపరంగా స్థిరమైన లాభాలు అందుకుంటారు. దీర్ఘ కాలిక ఋణాల నుండి ఊరట పొందుతారు.

కర్కాటకం: ఆర్థికంగా ఇబ్బందులు వలన నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. అకారణంగా ఇతరులతో మాటపట్టింపులు కలుగుతాయి. చేపట్టిన పనులలో శ్రమ తప్ప ఫలితం కనిపించదు. నేత్ర సంబంధిత అనారోగ్య సమస్యలు భాదిస్తాయి. కుటుంబ వాతావరణం చికాకు కలిగిస్తుంది. వృత్తి, ఉద్యోగాలు నిదానంగా సాగుతాయి.

సింహం: గృహమున శుభాకార్యములు నిర్వహిస్తారు. వృత్తి ఉద్యోగాలలో ఆశించిన మార్పులుంటాయి. కుటుంబ సభ్యులతో విందువినోదాలు కార్యక్రమాలలో పాల్గొంటారు. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. ఆదాయం పెరుగుతుంది. నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. ఆర్థిక పురోగతి కలుగుతుంది.

కన్య: వృధా ఖర్చుల విషయంలో ఆలోచించి ముందుకు ముందుకు సాగాలి. ఇతరుల వ్యవహారాలలో జోక్యం చేసుకోవడం మంచిది కాదు. వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. సమయానికి నిద్ర హారాలు ఉండవు. వ్యాపార పరంగా స్వలప ధన నష్ట సూచనలు ఉన్నవి. వృత్తి ఉద్యోగాలలో అధికారుల కోపానికి గురి కావల్సి వస్తుంది.

తుల: నిరుద్యోగ ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. గృహ నిర్మాణ విషయంలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. ఇంటాబయటా గౌరవమర్యాదలు పెరుగుతాయి. అవసరానికి ఆప్తుల నుండి ధన సహాయం అందుతుంది. వ్యాపారాలు సజావుగా సాగుతాయి. వృత్తి ఉద్యోగమున అనుకూల వాతావరణం ఉంటుంది.

వృశ్చికం: ఉద్యోగమున అధికారుల ఆదరణ పెరుగుతుంది. బంధు మిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. వ్యాపారాలలో కుటుంబ పెద్దల ఆలోచనలు కలసివస్తాయి. నిరుద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. కుటుంబ సభ్యులతో దైవ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆర్థికంగా కొంత మెరుగైన పరిస్థితులుంటాయి.

ధనస్సు: ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి. నూతన ఋణ ప్రయత్నాలు చేయవలసి వస్తుంది. కుటుంబ సభ్యుల మాటలు కొంత మానసికంగా కలచివేస్తాయి. వ్యాపార ఉద్యోగాలలో మరింత గందరగోళ పరిస్థితులు ఉంటాయి. ఇంటాబయటా బాధ్యతలు పెరుగుతాయి. మానసిక ఆరోగ్య సమస్యలు ఇబ్బంది కలిగిస్తాయి.

మకరం: వాహన ప్రయాణాలలో జాగ్రత్త అవసరం. చేపట్టిన పనులు మధ్యలో విరమిస్తారు. వ్యాపారపరంగా ఇతరులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. కుటుంబ సభ్యులతో స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి. వృత్తి ఉద్యోగాలలో చేయని పనికి నిందలు పడవలసి వస్తుంది. నిరుద్యోగులకు నిరాశ తప్పదు.

కుంభం: కీలక సమయంలో జీవితభాగస్వామి సలహాలు తీసుకోవడం మంచిది. పెద్దల ఆరోగ్య విషయంలో శుభవార్తలు అందుతాయి. శత్రువులు కూడా మిత్రులుగా మారి సహాయం అందిస్తారు. నూతన గృహ వాహనయోగం ఉన్నది. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో సమస్యల నుండి తెలివిగా బయటపడతారు.

మీనం: చేపట్టిన పనులలో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. భాగస్వామ్య వ్యాపారాలలో మీ అంచనాలు నిజమవుతాయి. దూరపు బంధువుల నుండి అందిన సమాచారం కొంత ఆనందం కలిగిస్తుంది. స్థిరాస్తి క్రయ విక్రయాలు అనుకూలంగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుకుంటారు.

# ఈ ప్రాణం అంజన్నదే!



మొదటి పేజీ తరువాయి

తాను హైటెన్షన్ విద్యుత్ తీగల ప్రమాదం నుంచి అద్భుతంగా బయటపడ్డానని పవన్ కల్యాణ్ గుర్తుచేసుకున్నారు. ఆ స్వామి ఆశీస్సులతోనే తాను ప్రాణాలతో ఉన్నానని, అందుకే కొండగట్టు నాకు పునర్జన్మనిచ్చింది అని బలంగా నమ్ముతానని తెలిపారు. అడుగడుగునా ధైర్యాన్ని, బలాన్ని ఇచ్చి నడిపిస్తున్నది కూడా ఆ అంజన్న స్వామేనని ఆయన పేర్కొన్నారు. ఈ పర్యటనలో భాగంగా, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నిధులతో చేపట్టనున్న రూ.35.19 కోట్ల అభివఅద్ధి పనులకు పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేశారు. ఈ నిధులతో 96 గదులతో కూడిన విశాలమైన సత్రం, దీక్షా విరమణ కోసం ఒకేసారి 2,000 మంది భక్తులు కూర్చునేలా ఆధునిక మండపం నిర్మించనున్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, టీటీడీ ఛైర్మన్ సహకారంతో ఈ పనులు సాధ్యమయ్యాయని ఆయన వివరించారు. ప్రముఖ ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్ సాయి పర్యవేక్షణలో, ఆలయ ప్రాశస్త్యం దెబ్బతినకుండా ఆగమశాస్త్ర నియమాల ప్రకారం ఈ నిర్మాణాలను చేపట్టనున్నారు.

## పోరాడండి: జనసైనికులకు పవన్ సందేశం

తెలంగాణ నేల తనకు పోరాడే ధైర్యాన్ని ప్రసాదించిందని, ఈ ప్రాంత ప్రజల స్ఫూర్తే తనను ముందుకు నడిపిస్తోందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. కొండగట్టు అంజన్నను దర్శించుకున్న అనంతరం కొండగట్టు సమీపంలోని బఅందావన్ రిసార్ట్‌లో నిర్వహించిన జనసేన నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తన రాజకీయ జీవితంలో పోరాట పటిమ, చైతన్యం, తెగింపు అన్నీ తెలంగాణ నుంచే వచ్చాయని ఆయన అన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, పోటీ చేయడం మాత్రం అలవాటు చేసుకోవాలని ఆయన వ్యాఖ్యానించారు. ఓటమికి భయపడకుండా పోటీ చేసే మనస్తత్వం జనసేనలో పెరగాలని సూచించారు. పోటీ పడినప్పుడే అనుభవం వస్తుందని, ప్రజల మధ్య ఉండగలమని అన్నారు. వ్యక్తిగతంగా తనకు ఎవరూ శత్రువులు కాదని ఆయన స్పష్టం చేశారు. తమ పోరాటం వ్యక్తులపై కాదని, విధానాలపైనే అని అన్నారు. ప్రజా ప్రయోజనాల కోసం, సరైన విధానాల కోసం మాత్రమే జనసేన రాజకీయాల్లో పోరాటం చేస్తుందని ఆయన అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం జనసైనికులు ముందుండాలని పిలుపునిచ్చారు. ప్రజల మధ్య ఉండి వారి సమస్యలను తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకు కఅషి చేయాల్సిన బాధ్యత ప్రతి జన సైనికుడిపై ఉందని అన్నారు. వంద మైళ్ల దూరం కూడా ఒక్క అడుగుతోనే ప్రారంభమవుతుందని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. జనసేన ప్రయాణం ఇప్పుడు బలంగా మొదలైందని, ముందున్న లక్ష్యాన్ని సాధించేందుకు అందరూ కలిసి పనిచేయాలని కార్యకర్తల సమావేశంలో ఆయన సూచించారు. అంజన్న సన్నిధి తనను కాపాడిందని పవన్ కల్యాణ్ అన్నారు. కష్టకాలంలో ఆధ్యాత్మిక బలం తనకు అండగా నిలిచిందని ఆయన అన్నారు.

# ప్రాణాలను తినేస్తోంది

మొదటి పేజీ తరువాయి

ఫ్రీ-లివింగ్ అమీబే అని కూడా పిలుస్తారు. వీటిలో చాలా వరకు ప్రమాదకరం కానప్పటికీ, కొన్ని జాతులు ప్రాణాంతక ఇన్ఫెక్షన్లకు కారణమవుతాయి. వీటిలో అత్యంత ప్రమాదకరమైనది నెగ్లేరియా ఫౌలెరి. కలుషిత నీటిలో దిగడం, ఈత కొట్టడం వంటివి చేసినప్పుడు ముక్కు ద్వారా శరీరంలోకి ప్రవేశించే ఈ అమీబా, మెదడుపై దాడి చేసి తీవ్రమైన ఇన్ఫెక్షన్‌కు కారణమవుతుంది. ఇది చాలా అరుదైనప్పటికీ, సోకిన వారిలో మరణాల రేటు దాదాపు 99 శాతం వరకు ఉంటుంది. ఇటీవలి సంవత్సరాలలో కేరళలో నమోదైన పలు మరణాలకు కూడా ఈ అమీబానే కారణమని అధ్యయనంలో గుర్తుచేశారు. ఈ అమీబాల గురించి చైనాలోని సన్ యట్ సేన్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకుడు లాంగ్‌ఫీ షూ మాట్లాడుతూ.. 'ఇతర సూక్ష్మజీవులు మనుగడ సాగించలేని పరిస్థితులను సైతం తట్టుకుని జీవించగలగడమే ఈ అమీబాలను మరింత ప్రమాదకరంగా మారుస్తోంది. ఇవి అధిక ఉష్ణోగ్రతలను, క్లోరిన్ వంటి శక్తివంతమైన క్రిమిసంహారకాలను కూడా తట్టుకోగలవు. సురక్షితం అనుకునే నీటి పంపిణీ వ్యవస్థలలో కూడా ఇవి జీవించగలవు' అని వివరించారు. అంతేకాకుండా, ఈ అమీబాలు ఇతర హానికరమైన బ్యాక్టీరియా, వైరస్‌లకు ట్రోజన్ హార్స్ (రహస్య వాహకాలు)గా పనిచేస్తాయని శాస్త్రవేత్తలు నొక్కిచెప్పారు. ఇతర సూక్ష్మజీవులను తమ కణాలలో దాచుకోవడం ద్వారా, నీటి శుద్ధి ప్రక్రియల నుంచి వాటిని కాపాడతాయి. దీనివల్ల తాగునీటి వ్యవస్థలలో ప్రమాదకర క్రిములు వ్యాప్తి చెందడానికి, యాంటీబయాటిక్ నిరోధకత పెరగడానికి కూడా ఆస్కారం ఏర్పడుతుంది. భూమి వేడెక్కడం వల్ల ఉష్ణోగ్రతను ఇష్టపడే ఈ అమీబాలు గతంలో లేని కొత్త ప్రాంతాలకు కూడా విస్తరించే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ ముప్పును ఎదుర్కోవడానికి మానవ ఆరోగ్యం, పర్యావరణ శాస్త్రం, నీటి నిర్వహణను అనుసంధానిస్తూ వన్ హెల్త్ విధానాన్ని అనుసరించాలని పరిశోధకులు పిలుపునిచ్చారు. ఇన్ఫెక్షన్లు రాకముందే ప్రమాదాన్ని తగ్గించడానికి బలమైన పర్యవేక్షణ, మెరుగైన నిర్ధారణ పద్ధతులు, అధునాతన నీటి శుద్ధి సాంకేతికతలను అవలంబించాలని సూచించారు.

# నాలుక కోస్తా

మొదటి పేజీ తరువాయి

సలహాలు, సూచనలు ఇస్తారని ఆశించాం. కానీ ఆయన తన బాధ్యతను విస్మరించారు. శాసనసభలో మాట్లాడకుండా ఫామ్ హౌస్‌లోనో, పార్టీ ఆఫీసులోనో కూర్చుని మాట్లాడితే ప్రజలకు ఏం ఉపయోగం ఉంటుంది? అక్కడ మాట్లాడితే ప్రజల్లో గందరగోళం మాత్రమే సృష్టించగలరు అని సీఎం ఎద్దేవా చేశారు. ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రాజెక్టుల విషయంలో వాస్తవాలను కళ్లకు కట్టినట్లు వివరించారని, ఆ నిజాలను ఎదుర్కోలేకే బీఆర్ఎస్ నేతలు సభ నుంచి పారిపోయారని విమర్శించారు. చట్టసభలను చిన్నచూపు చూసే సంస్కఅతిని కేసీఆర్ అలవర్చుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలమూరు-రంగారెడ్డి, ఎస్ఎల్బీసీ సొరంగం పనుల్లో జరిగిన జాప్యంపై కూడా సీఎం తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గత పాలకుల నిర్లక్ష్యం, కమీషన్ల కక్కుర్తి వల్లే కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులు నేటికీ పూర్తి కాలేదని ఆరోపించారు. దక్షిణ తెలంగాణను ఎడారిగా మార్చింది గత ప్రభుత్వమేనని ధ్వజమెత్తారు. 'మేము వాస్తవాలు మాట్లాడతాం.. తప్పులుంటే సరిదిద్దుకుంటాం. కానీ కేసీఆర్ మాత్రం కేవలం రాజకీయ లబ్ధి కోసమే కృష్ణా జలాల అంశాన్ని వాడుకుంటున్నారు' అని దుయ్యబట్టారు. నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల రైతుల ప్రయోజనాలను తాకట్టు పెట్టింది ఎవరో చర్చలో తేలిపోయిందని అన్నారు. ప్రాజెక్టుల సందర్భనలో కూడా ప్రతిపక్షం తమ వైఖరి ఏంటో చెప్పాలని, లేదంటే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.



# ఆరేళ్లలో 60 వేల కోట్ల స్వాహా

మొదటి పేజీ తరువాయి

తమిళనాడు (రూ.1,897 కోట్లు), ఉత్తరప్రదేశ్ (రూ.1,443 కోట్లు) నిలిచాయి. ఈ జాబితాలో తెలంగాణ ఐదో స్థానంలో ఉండటం ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్రంలో రూ.1,372 కోట్ల నష్టంతో పాటు 95,000 ఫిర్యాదులు నమోదయ్యాయి. ఈ మోసాల్లో సింహభాగం పెట్టుబడుల పథకాల పేరుతోనే జరుగుతోంది. మొత్తం నష్టంలో 77 శాతం ఇన్వెస్ట్‌మెంట్ స్కీమ్‌ల వల్లేనని డేటా స్పష్టం చేస్తోంది. డిజిటల్ అరెస్ట్ పేరుతో 8 శాతం, క్రెడిట్ కార్డ్ ఫ్రాడ్స్ ద్వారా 7 శాతం, సెక్స్‌టార్షన్ ద్వారా 4 శాతం చొప్పున ప్రజలు డబ్బు కోల్పోయారు. వేగవంతమైన డిజిటలైజేషన్, పెరిగిన ఆన్‌లైన్ లావాదేవీలను ఆసరాగా చేసుకొని మోసగాళ్లు రెచ్చిపోతున్నారు. 2025లో నమోదైన ఫిర్యాదుల్లో 45 శాతం కాంబోడియా, మయన్మార్, లావోస్ వంటి ఆగ్నేయాసియా దేశాల నుంచి వచ్చినట్లు అధికారులు గుర్తించారు. సైబర్ నేరాలపై ఫిర్యాదు చేసేందుకు ప్రభుత్వం నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఆర్థిక మోసాల బారిన పడిన వెంటనే బాధితులు 1930 అనే హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని అధికారులు సూచిస్తున్నారు.

# తెలంగాణోళ్ల మనసు గొప్పదని అర్థమైందా?

మొదటి పేజీ తరువాయి

అని వ్యాఖ్యలు చేసినప్పటికీ ఆయనకు ఘనస్వాగతం పలికి, అత్యంత గౌరవం ఇచ్చామని తెలిపారు. ప్రొటోకాల్ విషయంలోనూ గౌరవం ఇచ్చామని అన్నారు. అభివఅద్ధి కార్యక్రమాలకు సంబంధించి పవన్ కల్యాణ్ పేరు పైన పెట్టి, తెలంగాణ మంత్రుల పేర్లు కింద పెట్టినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేరును పెట్టాల్సిన అవసరం లేకపోయినప్పటికీ, ఆయన పేరును కూడా పేర్కొన్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రజల మంచి మనసును పవన్ కల్యాణ్ ఇప్పటికైనా గుర్తించాలని అనిరుధ్ రెడ్డి వ్యాఖ్యానించారు. తాము ఎప్పుడూ ఒకరి బాగు కోరే వారిమే తప్ప ఒకరికి దిష్టి పెట్టే వాళ్లం మాత్రం కాదని అన్నారు. తెలంగాణ నాయకులు దిష్టి పెట్టడం వల్లే కోనసీమ కొబ్బరిచెట్లు ఎండిపోయాయని కొద్ది రోజుల క్రితం పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు వివాదం అయిన సంగతి తెలిసిందే.



# పాలమూరుకు అనుమతులివ్వాలి

మొదటి పేజీ తరువాయి

చేసినప్పుడు మూడేళ్లలో ప్రాజెక్టును పూర్తిచేస్తామని కేసీఆర్ ప్రకటించారని, కానీ ఇప్పటికీ కేవలం 30 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయని తెలిపారు. కేసీఆర్ కుర్చీ వేసుకుని ప్రాజెక్టు కట్టిస్తానని చెప్పారని, కానీ ఆ కుర్చీ ఏడ పోయిందో, ఆయన ఎటుపోయారో తెలియదని ఎద్దేవా చేశారు. ఆయకట్టు కాలువల పనులు, భూసేకరణ లేకుండా రూ.55 వేల కోట్లతో సీడబ్ల్యూసీకి డీపీఆర్‌ను సమర్పించారని, కానీ.. ప్రస్తుత అంచనాల మేరకు ఈ ప్రాజెక్టు పూర్తికావాలంటే రూ.84 వేల కోట్లు అవసరం అవుతాయని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు.

# వెనెజులాపై అమెరికా అటాక్

మొదటి పేజీ తరువాయి

మిలిటరీ బేస్‌తో పాటు మిరాండా, లా గౌయిరా, అరాగువా రాష్ట్రాల్లోని సైనిక, పౌర లక్ష్యాలపై దాడులు జరిగాయి. 'మా దేశంలోని చమురు, ఖనిజ వనరులను స్వాధీనం చేసుకోవాలనే దురుద్దేశంతోనే అమెరికా ఈ దురాక్రమణకు పాల్పడింది. మా రాజకీయ స్వాతంత్ర్యాన్ని బలవంతంగా దెబ్బతీయాలని చూస్తున్నారు, కానీ అది ఎప్పటికీ జరగదు' అని వెనెజులా అధ్యక్షుడు మదురో ప్రకటించారు. అయితే, కాసేపటికే ఆయనను అమెరికా మిలటరీ బందీగా లంగదీసుకుంది. తమ సైన్యం చేతచిక్కిన వెనెజులా అధ్యక్షుడు నికోలస్ మదురోకు సంబంధించిన ఒక ఫొటోను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' ప్లాట్‌ఫామ్‌లో విడుదల చేశారు. కళ్లకు గంతలు కట్టి, చేతులు కట్టేసి ఉన్న మదురో... యూఎస్ నేవీకి చెందిన యుద్ధనౌక యూఎస్ఎస్ ఐవో జిమాపై ఉన్నట్లు ఆ ఫొటోలో కనిపిస్తోంది. 'నికోలస్ మదురో యూఎస్ఎస్ ఐవో జిమా నౌక పై ఉన్నాడు' అని ట్రంప్ ఆ ఫొటోకు క్యాప్షన్ ఇచ్చారు. నార్కో-టెర్రరిజం, డ్రగ్ ట్రాఫికింగ్ ఆరోపణల కింద మదురో దంపతులు న్యూయార్క్‌లో విచారణ ఎదుర్కోనున్నట్లు తెలుస్తోంది.

# నిద్రలోకి బీజేపీ ఎమ్మెల్యేలు

## ఉత్తమ్ ప్రజెంటేషన్ సమయంలో ఘటన

హైదరాబాద్, జనవరి 3 (ఈవార్తలు): అసెంబ్లీలో శనివారం కఅష్ణా నీళ్లపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న సందర్భంగా ఆసక్తికర ఘటన చోటుచేసుకున్నది. ఒకవైపు మంత్రి ఉత్తమ్‌కుమార్.. సీరియస్‌గా ప్రజెంటేషన్ ఇస్తుంటే, మరోవైపు బీజేపీ ఎమ్మెల్యేలు కునుకు తీశారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు సైతం నిద్ర మత్తులోకి జారుకున్నారు. సభలో కూర్చున్న వారంతా అతికష్టంపై నిద్రను నియంత్రించుకునే ప్రయత్నం చేశారు. బీజేపీ ఎమ్మెల్యేలు నిద్ర పోతున్న విషయాన్ని గమనించిన మంత్రి శ్రీధర్‌బాబు వారిని నిద్రలేపే ప్రయత్నం చేశారు. వాళ్లను నిద్రలేపాలని బీజేపీ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి చీటీలో రాసి పంపించారు. ఆ లేఖ చూసిన మహేశ్వర్‌రెడ్డి వెంటనే తన సీట్లో నుంచి లేచి వెనుక సీట్ల వద్దకు వెళ్లి నిద్రిస్తున్న తమ పార్టీ ఎమ్మెల్యేలు పాల్వాయి హరీశ్, ధన్‌పాల్, రామారావు పాటిల్‌ను నిద్రలేపారు.

# లాబీల్లోకి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

## సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర అసహనం

హైదరాబాద్, జనవరి 3 (ఈవార్తలు): కాంగ్రెస్ ఎమ్మెల్యేల తీరుపై సీఎం రేవంత్ సీరియస్ అయ్యారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న సమయంలో కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేల ప్రవర్తనపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో నీళ్లు-నిజాలుపై స్వల్పకాలిక చర్చ సందర్భంగా ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సమయంలో కొందరు ఎమ్మెల్యేలు సభలో ఉండకుండా లాబీల్లో తిరిగారు. ప్రభుత్వం ఒక కీలక అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తుంటే ఎమ్మెల్యేలు సభలో లేకపోవడం సరైన పద్ధతి కాదని సీఎం అభిప్రాయపడ్డారు. ఇలా వ్యవహరిస్తే ప్రభుత్వ ప్రతిష్ఠ దెబ్బతింటుందని అన్నారు. ప్రజలు సమావేశాలను గమనిస్తుంటారని, కాబట్టి ఎమ్మెల్యేలు అత్యంత బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. ఎమ్మెల్యేలు సభలో లేకపోవడం పార్టీ క్రమశిక్షణకు విరుద్ధమని ఆయన అన్నారు. ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాలపై చర్చ జరుగుతున్నప్పుడు అధికార పార్టీ ఎమ్మెల్యేలు తప్పనిసరిగా సభలో ఉండాలని సూచించారు. ఎమ్మెల్యేలందరినీ సభలోకి పిలిపించాలని కాంగ్రెస్ విప్‌లను ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావఅతం కాకుండా చూసుకోవాలని హితవు పలికారు.



# 14 మంది నక్సల్స్ హతం

మొదటి పేజీ తరువాయి

మావోయిస్టులు హతమయ్యారు. భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య తీవ్రస్థాయిలో కాల్పులు చోటుచేసుకున్నాయి. దక్షిణ బస్తర్ ప్రాంతంలో మావోయిస్టుల సంచారం ఉందన్న సమాచారం అందడంతో డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ) బృందాలు గాలింపు చర్యలు ప్రారంభించాయి. ఈ క్రమంలో ఉదయం సుమారు 5.30 గంటల సమయంలో అటవీ ప్రాంతంలో దాగి ఉన్న మావోయిస్టులు ఒక్కసారిగా కాల్పులకు దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. భద్రతా బలగాలు కూడా వెంటనే ప్రతిస్పందించడంతో రెండు వైపులా ఎదురుకాల్పులు జరిగాయి. కాల్పులు ముగిసిన తర్వాత ఆ ప్రాంతాన్ని పూర్తిగా జల్లెడ పట్టిన భద్రతా బలగాలకు 14 మంది మావోయిస్టుల మృతదేహాలు లభ్యమయ్యాయి. ఘటనా స్థలిలో 3 ఏకే-47 రైఫిళ్లతో పాటు, పలు ఆయుధాలు కూడా స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అయితే, ఆ ప్రాంతంలో ఇంకా మావోయిస్టులు ఉండే అవకాశముందని భావిస్తున్న భద్రతా బలగాలు సెర్చ్ ఆపరేషన్‌ను కొనసాగిస్తున్నాయి. జవాన్ల భద్రతను దృష్టిలో పెట్టుకుని ఎన్‌కౌంటర్ జరిగిన కచ్చితమైన ప్రదేశాన్ని అధికారులు ప్రస్తుతం బయటకు వెల్లడించలేదు. పూర్తి వివరాలు గాలింపు చర్యలు ముగిసిన తర్వాత వెల్లడించే అవకాశం ఉందని పోలీసు వర్గాలు తెలిపాయి.

# తప్పంతా కేసీఆర్‌దే

## పాలమూరుకు మరణశాసనం.. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.. పాలమూరు ప్రాజెక్టుపై పీపీటీ

హైదరాబాద్, జనవరి 3 (ఈవార్తలు): బీఆర్ఎస్ పార్టీ కృష్ణా బేసిన జలద్రోహి అని.. పాలమూరు ప్రజలకు కేసీఆర్ మరణశాసనం రాశారని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం అసెంబ్లీలో ఆయన కృష్ణా జలాలు, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. 2014లో కేసీఆర్ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.7.469.38 కోట్లు ఖర్చు పెడితే ఉమ్మడి మహబూబ్‌నగర్‌లోని ప్రాజెక్టులన్నీ పూర్తయ్యేవన్నారు. కల్వకుర్తి, బీమా, నెట్టెంపాడు, కోయిలాసాగర్ లిఫ్ట్ స్కీములు పూర్తయితే 8.65 లక్షల ఎకరాలకు నీరు అందేదని తెలిపారు. కానీ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రూ.1.87 లక్షల కోట్లు సాగునీటి ప్రాజెక్టుల పేరిట ఖర్చు చేసినప్పటికీ.. ఉమ్మడి మహబూబ్‌నగర్‌కు మొండి చేయి చూపారని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలకులు ఇరిగేషన్ ప్రాజెక్టుల కోసం 11 శాతం వడ్డీ రేటుకు అప్పులు తీసుకొస్తే.. తాము అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంతో ఇరిగేషన్ శాఖకు కేటాయించిన రూ.24 వేల కోట్లతో రూ.10 వేలకోట్లు వడ్డీల కిందనే సరిపోయాయని గుర్తుచేశారు. ఇరిగేషన్ శాఖకు సంబంధించిన అప్పుల వడ్డీ లేటును7 శాతానికి తీసుకొచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని, ఇందులో కేంద్ర ప్రభుత్వం కూడా సహకరించిందని వెల్లడించారు.

**కాళేశ్వరంపై మోజుతో పాలమూరుపై నిర్లక్ష్యం**

కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టుపై ఉన్న మోజుతో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారని ఉత్తమ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పచేళ్లలో కాళేశ్వరం ప్రాజెక్టు కోసం రూ.90వేల కోట్లు వెచ్చిస్తే.. పామూరు-రంగారెడ్డిపై కేవలం రూ.27 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పబ్లిక్ హియరింగ్ 2017లో నిర్వహిస్తే, పాలమూరుకు 2021లో నిర్వహించారని తెలిపారు. ఎండలు ఎక్కువగా ఉన్నాయని పబ్లిక్ హియరింగ్‌ను కేసీఆర్ క్యాన్సిల్ చేయడం విడ్డూరమని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పనులను హైస్పీడ్‌తో చేపట్టి.. పాలమూరు పనులను స్లో డౌన్ చేశారని అన్నారు. జూరాల వద్దనే పాలమూరు-రంగారెడ్డి సోర్స్ పాయింట్ ఉంటే.. రోజుకు 2.8 టీఎంసీల నీటి లభ్యత ఉండేదని, తద్వారా 25 రోజుల్లో 75 టీఎంసీల నీటిని వినియోగించుకునేందుకు అవకాశం ఉండేవని వెల్లడించారు. దాంతో 10 లక్షల ఎకరాలకు నీరు అందేదని చెప్పారు. కేవలం రూ.32 వేల కోట్లతో ప్రాజెక్టు కూడా పూర్తి అయ్యేదన్నారు. తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు ప్రాజెక్టును తరలించి ఉత్తర తెలంగాణకు అన్యాయం చేసినట్టుగానే పాలమూరును జూరాల నుంచి శ్రీశైలం వద్దకు మార్చి ఉమ్మడి మహబూబ్‌నగర్‌కు తీవ్రమైన అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికితోడు జూరాల వద్ద ప్రాజెక్టు ఉంటే స్టోరేజ్ కేపాసిటీ 121 టీఎంసీలు ఉండేవని, శ్రీశైలం వద్దకు మార్చి 66 టీఎంసీలకు తగ్గించారన్నారు.

**పాలమూరు పనులు 30 శాతమే పూర్తి..**

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో ఒక పంపు ఆన్ చేసి ఆపేశారని మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. ఈ ప్రాజెక్టుపై బీఆర్ఎస్ రూ.26,262 కోట్లు ఖర్చుచేయగా అది మొత్తం అంచనాతో 32 శాతమే అని, అయినా ఇంకా 39 వేల ఎకరాల భూసేకరణ పెండింగ్‌లో ఉందని స్పష్టం చేశారు. 2016లో శంకుస్థాపన చేసినప్పుడు మూడేళ్లలో ప్రాజెక్టును పూర్తిచేస్తామని కేసీఆర్ ప్రకటించారని, కానీ ఇప్పటికీ కేవలం 30 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయని తెలిపారు. కేసీఆర్ కుర్చీ వేసుకుని ప్రాజెక్టు కట్టిస్తానని చెప్పారని, కానీ ఆ కుర్చీ ఏడ పోయిందో, ఆయన ఎటుపోయారో తెలియదని ఎద్దేవా చేశారు. ఆయకట్టు కాలువల పనులు, భూసేకరణ లేకుండా రూ.55 వేల కోట్లతో





సీడబ్ల్యూసీకి డీపీఆర్‌ను సమర్పించారని, కానీ.. ప్రస్తుత అంచనాల మేరకు ఈ ప్రాజెక్టు పూర్తికావాలంటే రూ.84 వేల కోట్లు అవసరం అవుతాయని అంచనా వేస్తున్నట్లు చెప్పారు.

**ఏపీ దోచుకుంటున్నా బీఆర్ఎస్ సైలెంట్..**

జూరాల నుంచి 22 పంపులతో 414 మీటర్ లిఫ్ట్ చేయాల్సి ఉండగా, శ్రీశైలం నుంచి 37 పంపులతో 260 మీటర్ల ఎత్తు లిఫ్ట్ చేయాల్సి ఉంటుందని ఉత్తమ్ తెలిపారు. 2014కు ముందు కృష్ణా బ్యాక్ వాటర్ నుంచి ఏపీ అక్రమంగా రోజుకు 4.47 టీఎంసీలు తరలించగా, పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో ఏపీ అక్రమంగా తరలించుకునే సామర్థ్యాన్ని 13 టీఎంసీలకు పెంచుకున్నారని వెల్లడించారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా రోజుకు 3 టీఎంసీలను ఏపీ దోచుకునేందుకు ప్రయత్నిస్తుంటే బీఆర్ఎస్ నిశ్శబ్దంగా ఉందని చెప్పారు. తాము వచ్చాక ఏపీ, కేంద్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొచ్చి ఆ ప్రాజెక్టు పనులు నిలిపివేయించామన్నారు. గత 12 ఏళ్లలో ఎప్పుడూ లేని విధంగా కృష్ణా జలాల నుంచి 266 టీఎంసీలను 2024-25 సంవత్సరంలో తెలంగాణ వినియోగించినట్టు గణాంకాలు చెబుతున్నాయని వెల్లడించారు. 2004-14 వరకు కృష్ణా జలాల నుంచి ఏపీ 730 టీఎంసీలు అక్రమంగా తరలించుకుపోగా, 2014-24 వరకు 11,900 టీఎంసీలు తరలించిందని, దీని ఆధారంగా గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ విధంగా వ్యవహరించిందో అర్థమవుతున్నదన్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులరేటరీ, రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా రోజుకు 13 టీఎంసీలు తరలించేందుకు కుట్ర చేశారని.. బీఆర్ఎస్‌కు తెలిసే కాలువల వెడల్పు పనులు జరిగాయన్నారు.

**బీఆర్ఎస్ ఒప్పందం ప్రకారమే ముందుకు**

గత ప్రభుత్వం దిగిపోయే వరకు కూడా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి (పీఆర్ఎల్ఐఎస్)కు హైడ్రాలజీ క్లియరెన్స్, ఎన్విరాన్మెంటల్ క్లియరెన్స్, ఇరిగేషన్ ప్లానింగ్ క్లియరెన్స్, ఇంటర్ స్టేట్ క్లియరెన్స్ లేదని మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. 90 టీఎంసీల్లో 45 టీఎంసీలు గోదావరి నీటి మళ్లింపు, 45 టీఎంసీలు మైనర్ ఇరిగేషన్ సేవింగ్ కోసమని గత ప్రభుత్వం చెప్పినట్టుగానే తాము కూడా ముందుకు పోతున్నామని స్పష్టం చేశారు. 90 టీఎంసీలతో పీఆర్ఎసీని ముందుకు తీసుకెళ్తామని, ఎవరెన్ని అవాస్తవాలు చెప్పినా నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. కృష్ణా బేసిన్లోని ప్రాజెక్టులపై గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహించిందన్నారు. మరోవైపు.. ఈ ప్రాజెక్టును గత ప్రభుత్వం డ్రింకింగ్ వాటర్ పేరుతో సుప్రీంకోర్టులో చెప్పి ప్రారంభించిందని అన్నారు. 2022లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారమే తాము కూడా ముందుకు వెళ్తున్నామని స్పష్టం చేశారు. 90 టీఎంసీలో కనీసం ప్రస్తుతం మైనర్ ఇరిగేషన్ సేవింగ్స్‌కు సంబంధించిన 45 టీఎంసీలు అయినా ఇవ్వాలని లేఖ రాస్తే దానిని బీఆర్ఎస్ నాయకులు వక్రీకరిస్తున్నారని మండిపడ్డారు.

### మూడేళ్లలో ప్రాజెక్టులు పూర్తిచేస్తాం

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టులకు రూ.1.25 లక్షల కోట్లు ఖర్చు చేస్తే, కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులకు కేవలం రూ.41 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని మంత్రి వెల్లడించారు. దీంతోపాటు కాళేశ్వరం వద్ద రోజుకు లిఫ్ట్ చేసే సామర్థ్యాన్ని 2 టీఎంసీల 3 టీఎంసీలకు పెంచారని, పాలమూరు-రంగారెడ్డి వద్ద 1.5 టీఎంసీ నుంచి 1 టీఎంసీకి తగ్గించి కుట్రచేశారని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కాంట్రాక్టర్ల కోసం పెంచిన రూ.27 వేల కోట్లను పాలమూరుపై ఖర్చు పెడితే ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో నీరు పుష్కలంగా పారేవని స్పష్టం చేశారు. మూడేళ్లలో 90 టీఎంసీల లక్ష్యంతోనే ఒరిజినల్ షేప్‌తో పాలమూరు-రంగారెడ్డిని పూర్తిచేస్తామన్నారు. అలాగే.. కృష్ణా బేసినల్‌లోని అన్ని ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇచ్చి ఈ టర్మ్‌లోనే పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. తాము వచ్చాక ఈ ప్రాజెక్టుపై రూ.7వేల కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. డిండి ప్రాజెక్టుకు రూ.1800 కోట్లు మంజూరు చేశామన్నారు.

### 763 టీఎంసీలు కావాలని వాదిస్తున్నాం

కృష్ణా నదీ జలాల్లో 73 శాతం తెలంగాణకే కేటాయించాలని తాము సమర్థవంతంగా ట్రిబ్యునల్ ముందు వాదిస్తున్నామని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో 299 టీఎంసీలకే ఒప్పుకొని రాష్ట్రానికి తీరని ద్రోహం చేశారని అన్నారు. ఇంకా ఇప్పుడు తమపై అసత్యాలు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు అబద్ధాలు చెప్పడంలో గోబెల్స్‌ను మించిపోయారని ఎద్దేవా చేశారు. ఆనాడు కృష్ణా జలాలను ఏపీ అక్రమంగా నోచుకుపోతుంటే బీఆర్ఎస్ నోరు మెదపలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే 555 టీఎంసీలు కావాలని ట్రిబ్యునల్ ముందు కొట్లాడుతున్నామని స్పష్టం చేశారు. అయితే.. అలకేషన్ వాటర్ కాకుండా డిపెండబులిటీ తదితరాలను కలిపితే కృష్ణాలో 811 కాకుండా 1,050 టీఎంసీల నీటి లభ్యత ఉన్నదని ట్రిబ్యునల్ చెబుతున్నదని.. దాని ప్రకారం అయితే 763 టీఎంసీలు తెలంగాణకు ఇవ్వాలని వాదనలు వినిపిస్తున్నామని పేర్కొన్నారు. కృష్ణా జలాల్లో 71 శాతం నీటిని తమకు కేటాయించాలని కోరుతున్నట్లు చెప్పారు. ఏడాదిలోపే ఫైనల్ తీర్పు రాబోతున్నదని స్పష్టం చేశారు. రెండు రాష్ట్రాల జల వివాదాలకు ఫుల్ స్టాప్ పడే సమయం రానే వచ్చిందన్నారు. కృష్ణా జలాల్లో నుంచి రాష్ట్రాల వినియోగం లెక్కించే టెలిమెట్రీ వ్యవస్థను కూడా గత ప్రభుత్వం పెట్టకుండా తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. ఆనాడు ఏపీకి మేలు చేసే విధంగా జగన్‌మోహన్‌రెడ్డితో ప్రజాభవన్ వేదికగా కేసీఆర్ సమావేశాలు నిర్వహించారని ఆరోపించారు. గోదావరి జలాలను తీసుకెళ్లి రాయలసీమను రతనాల సీమ చేస్తామని ప్రకటించారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ కృషి వల్లనే రాయసీమ లిఫ్ట్ పనులు ఆగిపోయాయని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నిర్వాకంతో చివరకు అలకేషన్ నీటిని కూడా వాడలేని పరిస్థితి నెలకొందన్నారు.

### నల్లమలసాగర్‌పై అసత్య ప్రచారం

మరోవైపు.. పోలవరం-బనకచర్ల/నల్లమలసాగర్‌పై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తున్నదని మంత్రి ఉత్తమ్ చెప్పారు. హరీశ్‌రావు పిచ్చిపట్టి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఈ రోజు వరకు కూడా ఆ ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతులు రాలేదని స్పష్టం చేశారు. సీడబ్ల్యూసీ పర్మిషన్ లేదని.. డీపీఆర్ అనుమతులు రాలేదని.. ఇంకా ఏ పర్మిషన్లు సైతం ఇవ్వలేదని చెప్పారు. అయినా.. దీనిపై తాము సుప్రీంకోర్టుకు వెళ్లామని, రిట్ పిటిషన్ దాఖలు చేశామని చెప్పారు. ఈ నెల 5వ తేదీన హియరింగ్ ఉందన్నారు. ఇరు రాష్ట్రాల జల వివాదాలపై కేంద్రం కమిటీ వేసిందని.. మీరు మీరు కూర్చొని సమస్య పరిష్కరించుకోవాలని సూచించిందని తెలిపారు. అయితే.. రాష్ట్ర ప్రయోజనాల కోసం తాము ఎవరితోనైనా మాట్లాడేందుకు సిద్ధంగా ఉన్నామని మంత్రి స్పష్టం చేశారు. అంతేకానీ ఒక్క చుక్క నీటిని వదులుకోబోమని చెప్పారు. నీళ్ల మీదే బీఆర్ఎస్ పార్టీనే సవాల్ చేసి నేడు వారే సభలో లేకపోవడం దురదృష్టకరమన్నారు.

## పవన్ బతకడం అంజన్న అద్భుతం

**బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్**



హైదరాబాద్, జనవరి 3 (ఈవార్తలు): 2009లో హుస్నాబాద్ ఎన్నికల ప్రచార సమయంలో జరిగిన విద్యుత్ ప్రమాదం నుంచి ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ప్రాణాలతో బయటపడటం కేవలం అదృష్టం కాదని, సాక్షాత్తు కొండగట్టు అంజన్న చూపిన ఒక అద్భుతమని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ అన్నారు. పవన్ కల్యాణ్ కొండగట్టు పర్యటనపై ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. పునర్జన్మనిచ్చిన కొండగట్టు అంజన్నకు భక్తితో కూడిన కృతజ్ఞత తెలిపారంటూ పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి అన్నారు. ఆ రోజు తాను ప్రాణాలతో బయటపడటం వెనుక కొండగట్టు అంజన్న ఆశీస్సులు ఉన్నాయనే గట్టి నమ్మకంతో, అచంచలమైన భక్తి విశ్వాసాలతో తనకి పునర్జన్మనిచ్చిన ఆ క్షేత్రంపై కృతజ్ఞతతో, ఆలయ అభివృద్ధి కోసం రూ.35.19 కోట్ల టీటీడీ నిధులతో దీక్షా విరమణ మండపం మరియు సత్రం నిర్మాణానికి పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేయడం సంతోషించదగ్గ విషయమని పేర్కొన్నారు. ఇందుకు తెలంగాణ ప్రజల పక్షాన పవన్ కల్యాణ్‌కు దాసోజు శ్రవణ్ ధన్యవాదాలు తెలియజేశారు. ఆధ్యాత్మికతను, సామాజిక బాధ్యతను చాటుతూ ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, అంజన్న ఆశీస్సులతో నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నానని పేర్కొన్నారు. ఈ నిధుల మంజూరుకు చొరవ చూపి సహకరించిన టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుకు కూడ ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## పవన్‌కు తప్పిన విద్యుత్తు ప్రమాదం

**అభిమానులకు అభివాదం చేస్తుండగా అడ్డువచ్చిన వైర్లు**

**కారుపై పడుకుని చాకచక్యంగా తప్పించుకున్న జనసేనాని**

మల్యాల, జనవరి 3 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ నేడు తెలంగాణలోని జగిత్యాల జిల్లా కొండగట్టులో పర్యటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో ప్రమాదాన్ని గుర్తించి జాగ్రత్తపడ్డారు. అభిమానులకు అభివాదం చేసేందుకు కారు పైకి ఎక్కగా, విద్యుత్ వైర్లు అడ్డురావడంతో ఆయన సమయస్ఫూర్తితో వ్యవహరించి సురక్షితంగా తప్పించుకున్నారు. వివరాల్లోకి వెళితే, శనివారం ఉదయం కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్న అనంతరం పవన్, ఓ ప్రైవేట్ రిసార్ట్ నుంచి బయటకు వచ్చారు. ఈ సందర్భంగా అభిమానులు, కార్యకర్తలకు అభివాదం చేసేందుకు ఆయన తన కారు పైకి ఎక్కారు. అదే సమయంలో అక్కడున్న సర్వీస్ విద్యుత్ వైర్లు ఆయనకు అతి సమీపంలోకి వచ్చాయి. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది ఆయనను హెచ్చరించగా, పవన్ చాకచక్యంగా కారు పైనే పడుకున్నారు. దీంతో వైర్లు ఆయన పైనుంచి వెళ్లిపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనతో అభిమానులు, భద్రతా సిబ్బంది ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు.

## 35 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా

కూకట్‌పల్లి, జనవరి 3 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి పరిధిలో కబ్జాకు గురైన సుమారు రూ. 35 కోట్ల విలువైన పార్కు స్థలాలను హైడ్రా అధికారులు కాపాడారు. మొత్తం 3 వేల గజాల విస్తీర్ణంలో ఉన్న రెండు పార్కుల స్థలాలను శనివారం స్వాధీనం చేసుకుని, వాటి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. కూకట్‌పల్లి భాగ్యనగర్ ఫేజ్-3 కాలనీలోని పార్కులు ఆక్రమణకు గురయ్యాయని అక్కడి సంక్షేమ సంఘం సభ్యులు ప్రజావాణిలో హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు అధికారులు రంగంలోకి దిగారు. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, ఆక్రమణలను నిర్ధారించుకున్న తర్వాత ఈ చర్యలు చేపట్టారు. సర్వే నంబర్లు 197, 200 పరిధిలో 1987లో హుడా అనుమతితో భాగ్యనగర్ ఫేజ్-3 లేఅవుట్ ఏర్పడింది. ఇందులో రెండు స్థలాలను పార్కుల కోసం కేటాయించారు. అయితే, 2 వేల గజాల పార్కులో సగం స్థలం, ఎకరం విస్తీర్ణంలోని మరో పార్కులో వెయ్యి గజాల స్థలం కబ్జాకు గురైనట్లు అధికారులు తమ నివేదికలో గుర్తించారు. ఈ నివేదిక ఆధారంగా కమిషనర్ ఆదేశాలతో శనివారం ఆక్రమణలను తొలగించారు. ఖాళీ చేయించిన స్థలంలో హైడ్రా బోర్డులను ఏర్పాటు చేసి, ప్రభుత్వ ఆస్తిగా ప్రకటించారు. తమ కాలనీలోని విలువైన పార్కు స్థలాలను కాపాడినందుకు స్థానికులు హైడ్రా అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.




## అన్నపూర్ణ స్టూడియోస్‌లో ఉద్యోగాలు

**ఫ్రెషర్స్‌కు ఆహ్వానం**

హైదరాబాద్, జనవరి 3 (ఈవార్తలు): తెలుగు సినీ పరిశ్రమలో అగ్రగామి నిర్మాణ సంస్థగా పేరుగాంచిన అన్నపూర్ణ స్టూడియోస్ నిరుద్యోగులకు శుభవార్త చెప్పింది. తమ సంస్థలో పలు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. సేల్స్, టెక్నాలజీ విభాగాల్లో ఖాళీలను భర్తీ చేయనున్నట్లు ఓ ప్రకటనలో పేర్కొంది. ఫ్రెషర్లు, కనీస అనుభవం ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపింది. ప్రకటన ప్రకారం, సేల్స్ ఎగ్జిక్యూటివ్ (మహిళలు), ఏఐ ప్రాంప్ట్ ఇంజనీర్స్ పోస్టుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు అర్హులు. ముఖ్యంగా సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు ఎంబీఏ లేదా బీబీఏ చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. ఈ పోస్టులకు అనుభవం లేనివారు (ఫ్రెషర్స్) కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు తమ రెజ్యూమ్‌ను ఫ్రతీఝఅఝజూబతీఝర్బఎఅశీం.ఎశీఎ అనే ఈమెయిల్ చిరునామాకు పంపాలని సూచించారు. మీడియా, వినోద రంగంలో కెరీర్ ప్రారంభించాలనుకునే యువతకు ఇది ఒక మంచి అవకాశమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## అన్వేష్ వ్యాఖ్యలు సరైనవే: బాబు గోగినేని

హైదరాబాద్, జనవరి 3 (ఈవార్తలు): ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, ఉపన్యాసకులు గరికపాటి నరసింహారావు వ్యాఖ్యలపై, నా అన్వేషణ యూట్యూబర్ అన్వేష్ స్పందనకు హేతువాది బాబు గోగినేని స్పందించారు. గరికపాటి మహిళల గురించి అనుచితంగా మాట్లాడారని, అది సరికాదని, అన్వేష్ ఆయనపై చేసిన విమర్శలు సమంజసమేనని ఆయన అభిప్రాయపడ్డారు. నటుడు శివాజీ మహిళల దుస్తులపై చేసిన వ్యాఖ్యలపై కూడా నా అన్వేషణ అన్వేష్ స్పందించారు. ఆ సమయంలో శివాజీని, గరికపాటిని ఉద్దేశించి ఆయన విమర్శలు గుప్పించారు. దీంతో అన్వేష్ పై నెటిజన్లు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ వివాదంపై బాబు గోగినేని స్పందిస్తూ, తాను చేసిన వ్యాఖ్యలకు నా అన్వేషణ యూట్యూబర్ అన్వేష్ క్షమాపణ చెప్పారని, వివరణ కూడా ఇచ్చారని గుర్తు చేశారు. విదేశాల్లో ఉండి మాట్లాడిన వ్యక్తిపై కేసులు పెట్టవచ్చా లేదా అనేది న్యాయ నిపుణులు తేల్చాల్సి ఉంటుందని ఆయన అన్నారు. విమర్శలు చేసే సమయంలో అన్వేష్ కూడాద సంయమనం పాటించి ఉండాల్సిందని ఆయన అభిప్రాయపడ్డారు. భిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్న సమయంలో, ప్రజలు ఆగ్రహంతో ఉన్నప్పుడు మాట్లాడే భాషపై దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. ఆయన ఇంకా మాట్లాడుతూ, బిగ్‌బాస్ హౌస్‌లో ఒక వ్యక్తి ఇద్దరు ముగ్గురు మహిళలను అసభ్యకరంగా తాకాడని ఆరోపించారు. ఆ వ్యక్తి పేరును తాను వెల్లడించబోనని, స్వయంగా ఆ వ్యక్తి మీడియా ముందుకు

# వృద్ధుడి నుంచి రూ.7 కోట్లు స్వాహా

సోమాజిగూడ/హైదరాబాద్, జనవరి 3 (ఈవార్తలు): ఒకవైపు డిజిటల్ అరెస్టులు ఉండవని పోలీసులు ప్రచారం చేస్తున్నప్పటికీ, సైబర్ నేరగాళ్లు మాత్రం తమ తెలివితేటలతో ప్రజలను భారీగా మోసం చేస్తూనే ఉన్నారు. తాజాగా హైదరాబాద్ కు చెందిన ఒక వృద్ధుడిని సైబర్ నేరగాళ్లు భయభ్రాంతులకు గురిచేసి ఏకంగా రూ.7 కోట్లకు పైగా కాజేశారు. సోమాజిగూడకు చెందిన 81 ఏళ్ల వృద్ధుడు గతంలో వ్యాపారం చేసి ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారు. గతేడాది అక్టోబర్ 27న ఆయన వాట్సాప్‌కు వచ్చిన కాల్‌లో ముంబయి నుంచి బ్యాంకాక్‌కు పంపిన కొరియర్‌లో ల్యాప్‌టాప్, పాస్‌పోర్టులు, మాదకద్రవ్యాలు ఉన్నాయని చెప్పి భయపెట్టారు. తాను ఎలాంటి కొరియర్ పంపలేదని చెప్పగానే, ముంబయి పోలీసులమంటూ మరో కాల్ చేసి మాదకద్రవ్యాల రవాణా, మనీ లాండరింగ్ కేసులు ఉన్నాయని బెదిరించారు. ఇంటి నుంచి కదలొద్దంటూ 'డిజిటల్ అరెస్ట్' చేశామని చెప్పి వీడియో కాల్‌లో మాట్లాడారు. ఆర్థిక లావాదేవీల పరిశీలన పేరుతో తొలుత రూ.19.80 లక్షలు బదిలీ చేయించుకున్నారు. అనంతరం సిగ్నల్ యాప్ డౌన్‌లోడ్ చేయించి, మ్యూచువల్ ఫండ్స్, ఫిక్స్‌డ్ డిపాజిట్లలో ఉన్న రూ.7.12 కోట్లను తమ ఖాతాల్లో జమ చేయించుకున్నారు. పరిశీలన పూర్తయ్యాక డబ్బు తిరిగి ఇస్తామని నమ్మించారు. డిసెంబరు 29న మరోసారి ఫోన్ చేసి కేసు మూసివేతకు అంటూ మరో రూ.1.2 కోట్లు అడగడంతో వృద్ధుడికి అనుమానం వచ్చింది. ఇటీవల డిజిటల్ అరెస్టులపై వచ్చిన వార్తలను చూసి తాను మోసపోయినట్లు గ్రహించి శుక్రవారం 1930 నంబర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ కె.వి.ఎం.ప్రసాద్ తెలిపారు.




# కూనంనేనీ.. కూతలు మానేయ్!

**భేషరతుగా క్షమాపణలు చెప్పు**

**మోదీపై ఎమ్మెల్యే కూనంనేని తీవ్ర వ్యాఖ్యలు**

**మండిపడ్డ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**



హైదరాబాద్, జనవరి 3 (ఈవార్తలు): రాజకీయాల్లో హుందాతనం, పరిణతి అవసరమని, కానీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వ్యక్తిగత దూషణలు, అర్థంలేని ఆరోపణలు చేయడం దురదృష్టకరమని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ప్రధానిపై ఆయన చేసిన వ్యాఖ్యలు హేయమైనవని అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికై, దేశాభివృద్ధికి అహోరాత్రులు శ్రమిస్తూ, అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ గౌరవాన్ని పెంచుతున్న నాయకుడు మోదీ అని కొనియాడారు. అలాంటి ప్రధానిపై కూనంనేని అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయడాన్ని తాను తీవ్రంగా ఖండిస్తున్నానని కిషన్ రెడ్డి అన్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ దివాలాకోరుతనాన్ని బయటపెట్టాయని విమర్శించారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. కూనంనేని వంటి వారు చేస్తున్న వ్యాఖ్యలతో ప్రజాస్వామ్య విలువలపై, రాజకీయ వ్యవస్థపై ఏవగింపు కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీపై కూనంనేని సాంబశివరావు చేసిన వ్యాఖ్యలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని కోరారు. ఇలాంటి అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయకుండా, సభా మర్యాదలు పాటించేలా చొరవ తీసుకోవాలని కిషన్ రెడ్డి సభాపతిని కోరారు. కాగా, కూనంనేని సాంబశివరావు శాసనసభలో మాట్లాడుతూ, మోదీ మైండ్‌ను టెస్ట్ చేయించాలని ఘాటు వ్యాఖ్యలు చేశారు.ఎక్కడి పనులు అక్కడేఅభివృద్ధి ఆగిపోయిందిరేవంత్ ప్రభుత్వంపై కవిత విమర్శలుసూర్యాపేట జిల్లాలో జనంబాటసూర్యాపేట, జనవరి 3 (ఈవార్తలు): ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. జనంబాటలో భాగంగా ఆమె సూర్యాపేట జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తెలంగాణలో అభివృద్ధి పనులు జరగడం లేదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయని ఆమె ఆరోపించారు. తన పర్యటనలో భాగంగా ఆమె వివిధ వర్గాల ప్రజలు, రైతులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ, సూర్యాపేట జిల్లాలో అభివృద్ధి పనులు ఎక్కడకక్కడే నిలిచిపోయాయని, అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. జిల్లా అభివృద్ధిలో తాను ఎలాంటి పాత్ర పోషించాలనే విషయంపై దృష్టి సారించానని ఆమె అన్నారు. అర్వపల్లి మండలంలోని కేజీవీబీ స్కూల్‌ను పరిశీలించినట్లు తెలిపారు. గత ఏడాది తుపాను వచ్చి పాఠశాల మునిగిపోతే కలెక్టర్ వచ్చి పరిశీలించారని, కానీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు.



## వైజాగ్ కమిషనర్‌కు న్యూఇయర్ విషెస్

విశాఖ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ శంకబ్రతబాగ్చిని మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం వ్యవస్థాపాధ్యకుడు జంగం జోషి, జోనల్ అడ్వైజర్ కోన ప్రకాశ్, జయరాజ్ ,లాజరస్ - వైజాగ్, జనవరి 3 (ఈవార్తలు)

## ఎన్నారై పాలసీ ఎక్కడ?

**ప్రభుత్వ హామీలపై ఎల్ రమణ ప్రశ్నల వర్షం**



హైదరాబాద్, జనవరి 3 (ఈవార్తలు): ప్రభుత్వ హామీల అమలుపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎల్ రమణ ప్రశ్నలు కురిపించారు. శనివారం మండలిలో మాట్లాడిన ఆయన.. 'కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు గల్ఫ్ బాధితులకు 1000 కోట్ల బడ్జెట్ కేటాయించాలి. గురుకుల పాఠశాలలో గల్ఫ్ బాధిత విద్యార్థులకు సీట్లు కేటాయించాలి. ఎన్ఆర్ఐ శాఖకు మంత్రిని కేటాయిస్తామన్నారు. ప్రవాసి ప్రజావాణి కార్యక్రమ నిర్వహణకు ఒక ప్రత్యేక అధికారిని కేటాయించాలి. ఎన్నారై పాలసీ తయారుచేసి అమలు చేయాలి.. పాలసీలో భాగంగా ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారికి ఆలస్యం లేకుండా తక్షణసాయంగా రూ.ఐదు లక్షలు కేటాయించాలి. సింగపూర్ మలేషియా దేశాల్లో నివసిస్తున్న వారికి ఎన్నారై పాలసీని వర్తింపజేయాలి. మాజీ విదేశాంగ శాఖ మంత్రి స్వర్గీయ శివశంకర్ జయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహించే మాదిరి ప్రవాసి తెలంగాణ దివస్ ఏర్పాటు చేయాలి' అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



## టీపీసీసీ చీఫ్‌కు న్యూఇయర్ విషెస్

టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రి సీతక్కకు అంబర్ పేటకు కాంగ్రెస్ నేతలు న్యూఇయర్ విషెస్ చెప్పారు. శనివారం వారిని మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి నాగభూషణం, కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కఅష్ణ గౌడ్, శ్రీకాంత్ నేత, తదితరులు పాల్గన్నారు.



## ఎంపీ వద్దిరాజును సత్కరించిన పోగుల నవీన్

జూబ్లీహిల్స్, జనవరి 3 (ఈవార్తలు): బీఆర్ఎస్ జూబ్లీహిల్స్ నియోజకవర్గ నాయకుడు, న్యాయవాది పోగుల నవీన్ పటేల్ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రను కలిసి పుష్పగుచ్ఛమిచ్చి శాలువాతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు. బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని క్యాంప్ కార్యాలయంలో ఎంపీ రవిచంద్రను శనివారం మధ్యాహ్నం నవీన్ కలిసి నూతన సంవత్సరం సందర్భంగా హఅదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నవీన్‌కు ఎంపీ వద్దిరాజు తన ఆశీస్సులు అందజేస్తూ, విద్యావంతులైన యువత క్రియాశీల రాజకీయాల్లోకి రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాసాల వెంకటేశ్, బీఆర్ఎస్ నాయకుడు ప్రసాద్ చౌదరి తదితరులు పాల్గన్నారు.

## స్మిత భీమవరం బీట్ పాటలో రఘురామ సందడి

అమరావతి, జనవరి 3 (ఈవార్తలు): రాజకీయాల్లో తనదైన శైలితో వ్యవహరించే ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు తనలోని మరో కోణాన్ని ఆవిష్కరించారు. ప్రముఖ పాప్ సింగర్ స్మిత సంక్రాంతి పండుగ సందర్భంగా విడుదల చేసిన 'భీమవరం బీట్' అనే వీడియో సాంగ్‌లో ఆయన స్పెషల్ అప్పియరెన్స్‌తో సర్‌ప్రైజ్ ఇచ్చారు. ఈ పాటలో స్మిత, ర్యాపర్ నోయల్‌తో కలిసి ఆయన డ్యాన్స్ చేయడం ఇప్పుడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈ 'భీమవరం బీట్' పాటను రూపొందించారు. స్మిత, నోయల్ షాన్ కలిసి ఈ పాటకు సాహిత్యం అందించి, సంగీతం సమకూర్చి ఆలపించారు. పండగ వాతావరణం, హై ఎనర్జీ బీట్స్‌తో సాగే ఈ గ్రూవీ డ్యాన్స్ నంబర్ ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటోంది. ఇందులో 'ఆర్ఆర్ఆర్' సినిమాలోని పాపులర్ స్టెప్పులను కూడా చేర్చడం విశేషం. విజయ్ బిన్నీ దర్శకత్వం వహించిన ఈ వీడియో సాంగ్‌లో స్మిత, నోయల్ డ్యాన్సులు ఎంతో ఉత్సాహభరితంగా ఉన్నాయి. వీరితో పాటు రఘురామకృష్ణరాజు కూడా స్టెప్పులేయడంతో పాటకు మరింత క్రేజ్ వచ్చింది. విడుదలైన కొద్ది గంటల్లోనే ఈ పాట యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లోకి రావడం దాని ఆదరణకు నిదర్శనంగా నిలుస్తోంది. మొత్తం మీద, ఈ సంక్రాంతి సీజన్‌లో యువతను అలరించేందుకు 'భీమవరం బీట్' ఒక పక్కా ఎంటర్‌టైన్‌మెంట్ ప్యాకేజీగా మారింది.




## ఉత్తమ ఉపాధ్యాయురాలిగా స్వర్ణలత

మల్యాల, జనవరి 3 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని తాటిపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న భూక్య స్వర్ణ లతకు ఉత్తమ ఉపాధ్యాయురాలుగా అవార్డు దక్కింది. తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జన్మదినాన్ని పురస్కరించుకొని జిల్లాలోని పలువురికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రభుత్వం ప్రకటించింది. ఈ అవార్డును శనివారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్ చేతుల మీదుగా ఆమె అందుకున్నారు.

# ఐఐటీహెచ్‌లో అద్భుత ఆవిష్కరణలు

## ఇన్నోవేషన్ డేలో వినూత్న స్టార్టప్‌ల సాంకేతిక ప్రదర్శనలు


సంగారెడ్డి, జనవరి 3 (ఈవార్తలు): దేశంలోని విద్యాసంస్థలు, పరిశ్రమలు, స్టార్టప్ సంస్థల ప్రతినిధుల అనుసంధానంతో సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్లో శనివారం జరిగిన ఇన్నోవేషన్ డే ఇంటర్ ఐఐటీ యూజీ ఇన్నోవేషన్ మీట్ సరికొత్త ఆవిష్కరణలకు వేదికగా నిలిచింది. ఈ ఉత్సవాన్ని ఐఐటీహెచ్ బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ చైర్మన్ డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డి ప్రారంభించారు. గౌరవ అతిథిలుగా నిఖిల్ చక్రవర్తి ఐఏఎస్ కమీషనర్, తెలంగాణ ప్రభుత్వ అధికారి జయేష్ రంజన్, టీహబ్ సీఈవో కవికఅత్‌లు హాజరయ్యారు. ఐఐటీహెచ్‌లోని డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్‌లో మెకానికల్, ఎలక్ట్రికల్, ఏరోస్పేస్, డిజైన్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం పరిశోధకులు మూడు సంవత్సరాల పాటు శ్రమించి ఎయిర్ టాక్సీని తయారు చేశారు. ఇంటి దగ్గరే ఉండి జీపీఎస్ అనుసంధానంతో మన మొబైల్‌లో ఉన్న యాప్‌ను ఉపయోగించి ఈ ఎయిర్ టాక్సీ బుక్ చేసుకోవచ్చు. ఏదైనా బిల్డింగును కట్టేటప్పుడు మాత్రమే వెలుతురు అన్ని మూలల్లోకి ప్రవేశిస్తుంది. భవనం పూర్తయితే వెలుతురు కనుమరుగవుతుంది. ఇందుకోసం అద్దాల ప్రతిబింబాలను ఉపయోగించి బిల్డింగ్ పూర్తి అయిన తర్వాత కూడా అన్ని మూలల్లోకి సూర్యకాంతిని ప్రసరింపజేసే టెక్నాలజీని డే లైట్ సిస్టం పేరుతో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విద్యార్థులు లావణ్య కుమార్, కౌశిక్, శ్రావణి, వైష్ణవిలు రూపొందించారు. వీరు తయారుచేసిన ప్రత్యేక పరికరం ఏదైనా బిల్డింగ్‌పైన అమర్చి అక్కడి నుంచి 50 ఫ్లోర్ల కింది భాగం వరకు అద్దాలను మూల మూలల్లో అమర్చుతూ ప్రతి గదిలోకి వెలుతురుని ప్రసరింపజేసి



(ఫొటోలు)

1. ఐఐటీహెచ్ పరిశోధకులు అభివఅద్ధి చేసిన డ్రైవర్ లెస్ ఎయిర్ టాక్సీ
2. ఇంటి మూల మూలల్లోకి సూర్యకాంతిని ప్రసరింపజేసే డే లైట్ సిస్టం
3. డే లైట్ సిస్టం టెక్నాలజీ నమూనా
4. సైన్యం కోసం చక్రవీర్ పేరుతో ఐఐటీహెచ్ టీహాన్ పరిశోధకులు తయారు చేసిన కార్గో సేవర్ డ్రోన్
5. కూరగాయలు తెంపేందుకు ఉపయోగించే అగ్రీబాట్ రోబో

ఆకట్టుకున్నారు. ఈ పరికరాన్ని మార్కెట్లో లక్ష రూపాయలకు వినియోగదారులకు అందించనున్నట్లు వారు తెలిపారు. ఐఐటీహెచ్‌లోని టీహాన్ పరిశోధకులు సైన్యం అవసరాలను తీర్చడానికి కొండగుట్టలో సైతం దాదాపు 200 కిలోల ఆహార పదార్థాల్ని, ఇతర వస్తువుల్ని తీసుకెళ్లే బ్యాటరీతో నడిచే డ్రోన్‌ని చక్రవీర్ పేరుతో తయారుచేశారు. ఇది ఒక సెకండ్‌కు పది మీటర్ల దూరం, 5 మీటరల్ల ఎత్తుకు గాల్లో ఎగురుతూ రెండు కిలోమీటర్ల ఎత్తుకు ఎగరగల సామర్థ్యం కలిగి ఉందని పరిశోధకులు తెలిపారు. అలాగే ఐఐటీహెచ్ కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన పరిశోధకులు కూరగాయల రైతులకు ఖర్చు తగ్గించేందుకు అగ్రీబాట్ పేరుతో టమాటో పంటను సంరక్షించి, టమాటోలను కోసే యంత్రాన్ని రూపొందించారు. ఇవి కాక, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్. వాతావరణ మార్పు, ఈ-మొబిలిటీ, క్లీన్‌ఎనర్జీ, స్థిరమైన సాంకేతికతలు, రక్షణకు సంబంధించిన వివిధ రకాల ఆవిష్కరణలను ఈ వేడుకలో ప్రదర్శించారు.









# చంద్రబాబు ఖాతాలో జగన్ కష్టం

**భోగాపురం విమానాశ్రయం ఘనత జగన్‌దే: అమర్నాథ్**

భోగాపురం, జనవరి 3 (ఈవార్తలు): భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి సంబంధించిన ఘనత పూర్తిగా మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ దేనని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల ఎన్నో ఏళ్ల కలను నిజం చేసిన నాయకుడు జగన్ అని కొనియాడారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ కోసం అవసరమైన భూ సమీకరణ, భూ వివాదాల పరిష్కారం అన్నీ జగన్ హయాంలోనే జరిగాయని అమర్నాథ్ గుర్తుచేశారు. భూములు ఇచ్చిన రైతులు, బాధితులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో దాదాపు రూ.1,100 కోట్ల భారీ పరిహారాన్ని జగన్ ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఇది గత ప్రభుత్వాలు చేయలేని పని అని



వ్యాఖ్యానించారు. 2023 మే 3వ తేదీన భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు జగన్ శంకుస్థాపన చేశారని, 2025 డిసెంబర్ నాటికి తొలి విమానం ల్యాండ్ అయ్యేలా జీఎంఆర్ సంస్థకు స్పష్టమైన టార్గెట్ ఇచ్చారని తెలిపారు. అదే ప్రణాళికలో భాగంగానే ఇప్పుడు తొలి ఫ్లైట్ ల్యాండింగ్‌కు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. అయితే ఎన్నికల ముందు ఉత్తరాంధ్ర ప్రజలను మభ్యపెట్టేందుకు 2019 ఫిబ్రవరి 14న చంద్రబాబు హడావిడిగా శంకుస్థాపన చేశారని అమర్నాథ్ ఆరోపించారు. మొత్తం 2,700 ఎకరాలు అవసరమైతే, చంద్రబాబు హయాంలో 250 ఎకరాలు కూడా సేకరించలేదని తీవ్ర విమర్శలు చేశారు. జగన్ చేసిన కష్టాన్ని, ఆయన తీసుకున్న నిర్ణయాల ఫలితాన్ని తన ఖాతాలో వేసుకునే ప్రయత్నం చంద్రబాబు చేస్తున్నారని అమర్నాథ్ మండిపడ్డారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ ఉత్తరాంధ్ర అభివృద్ధికి కీలక మైలురాయిగా నిలుస్తుందని, దీనికి అసలు శిల్పి జగనేనని చెప్పారు.



# భోగాపురం ఎయిర్‌పోర్ట్‌లో నేడే తొలి టెస్ట్ ఫ్లైట్

భోగాపురం, జనవరి 3 (ఈవార్తలు): ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల నెరవేరే దిశగా కీలక ముందడుగు పడింది. విజయనగరం జిల్లాలోని భోగాపురంలో నిర్మిస్తున్న అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంలో తొలి టెస్ట్ ఫ్లైట్ ల్యాండింగ్ కోసం సర్వం సిద్ధమైంది. ఆదివారం ఉదయం 11 గంటలకు ఈ చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతం కానుంది. ఈ ట్రయల్ రన్‌లో భాగంగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ ఉన్నతాధికారులతో కూడిన బృందం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో ఇక్కడకు చేరుకోనుంది. జీఎంఆర్ గ్రూప్ అనుబంధ సంస్థ అయిన జీఎంఆర్ విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ ఈ విమానాశ్రయాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోంది. ఇప్పటికే సుమారు 95 శాతం పనులు పూర్తయినట్లు అధికారులు ధృవీకరించారు. వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించడానికి ముందు విమానాశ్రయం సంసిద్ధతను అంచనా వేయడంలో ఈ ట్రయల్ రన్ అత్యంత కీలకం. ఈ కమర్షియల్ వ్యాలిడేషన్ ఫ్లైట్ ద్వారా రన్‌వే పటిష్టత, నావిగేషన్ సిస్టమ్స్, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ పనితీరును క్షుణ్ణంగా పరిశీలిస్తారు. ఈ ప్రక్రియను ఆపరేషనల్ రెడీనెస్ అండ్ ఎయిర్‌పోర్ట్ ట్రాన్స్‌ఫర్ గా వ్యవహరిస్తారు.



## సనాతన ధర్మ పరిరక్షణకు సంతకాల ఉద్యమం

**పవన్ కళ్యాణ్‌తోనే తొలి సంతకం**

**జగిత్యాల జనసైనికుడు**


**సట్ట సతీశ్ ప్రత్యేక చొరవ**

మల్యాల, జనవరి 3 (ఈవార్తలు): సనాతన ధర్మ పరిరక్షణ కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలన్న జనసేన అధినేత, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపునకు స్పందనగా జగిత్యాల జిల్లాకు చెందిన జనసైనికుడు సట్ట సతీశ్ సంతకాల సేకరణ ఉద్యమాన్ని ప్రారంభించారు. పవన్ కళ్యాణ్ శనివారం కొండగట్టుకు వచ్చిన సందర్భంగా ఆయనను కలిసిన సట్ట సతీశ్, సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు ఏర్పాటు కోరుతూ చేపట్టిన సంతకాల ఉద్యమానికి తొలి సంతకం ఆయనే చేయాలంటూ విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన పవన్ కళ్యాణ్ తన సంతకంతో ఈ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ సట్ట సతీశ్‌ను ప్రత్యేకంగా అభినందిస్తూ, సనాతన ధర్మ పరిరక్షణకు చేపడుతున్న ఈ ఉద్యమం అభినందనీయమని ప్రశంసించారు. ప్రజల్లో అవగాహన పెంచేలా ఇలాంటి కార్యక్రమాలు ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. గతంలో జనసేన పార్టీ అధికారంలోకి రావాలనే సంకల్పంతో సట్ట సతీశ్ చెప్పులు వేసుకోకుండా ఏడాదికి పైగా దీక్ష చేపట్టిన విషయం తెలిసిందే. పవన్ కళ్యాణ్ నేతఅత్వంలోని కూటమి అధికారంలోకి వచ్చిన అనంతరం మాత్రమే ఆయన తన దీక్షను విరమించారు. ప్రస్తుతం సనాతన ధర్మ పరిరక్షణ కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు కావాలన్న లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా సంతకాల సేకరణ ఉద్యమాన్ని విస్తఅతంగా నిర్వహించనున్నట్లు సట్ట సతీశ్ తెలిపారు. ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని ఆయన పేర్కొన్నారు.

## డ్రగ్స్‌తో దొరికిన ఎమ్మెల్యే కొడుకు

**ఏపీ బీజేపీ ఎమ్మెల్యే**

**ఆదినారాయణరెడ్డి కుమారుడు అరెస్ట్**



హైదరాబాద్, జనవరి 3 (ఈవార్తలు): హైదరాబాద్‌లో డ్రగ్స్ కేసులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బీజేపీ ఎమ్మెల్యే కుమారుడు అరెస్ట్ కావడం సంచలనం సృష్టిస్తోంది. కడప జిల్లా జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి కుమారుడు సుధీర్ రెడ్డిని తెలంగాణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. డ్రగ్స్ తీసుకుంటుండగా అతడు పట్టుబడినట్లు తెలుస్తోంది. వివరాల్లోకి వెళితే, నానక్‌రామ్‌గూడ ప్రాంతంలో డ్రగ్స్ పార్టీ జరుగుతోందన్న సమాచారంతో తెలంగాణ పోలీసుల ప్రత్యేక విభాగమైన 'ఈగల్ టీం' ఆకస్మిక దాడులు నిర్వహించింది. ఈ తనిఖీల్లో సుధీర్ రెడ్డి డ్రగ్స్ తీసుకుంటుండగా పట్టుబడినట్లు సమాచారం. వెంటనే అతనికి అక్కడికక్కడే డ్రగ్స్ నిర్ధారణ పరీక్షలు చేయగా, ఫలితం పాజిటివ్‌గా వచ్చింది. దీంతో పోలీసులు సుధీర్ రెడ్డిని అరెస్ట్ చేశారు. అరెస్ట్ అనంతరం అతడిని నార్సింగి పోలీసులకు అప్పగించినట్లు తెలుస్తోంది. సుధీర్ రెడ్డిని డి-అడిక్షన్ సెంటర్‌కు తరలించినట్లు కూడా వార్తలు వస్తున్నాయి. సుధీర్ రెడ్డి తండ్రి ఆదినారాయణ రెడ్డి ప్రస్తుతం బీజేపీ ఎమ్మెల్యేగా ఉన్నారు. గతంలో ఆయన టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు.



# నార్కో టెర్రరిజం అంతానికే దాడి

## వెనెజులాపై దాడిని సమర్థించుకున్న అమెరికా

వాషింగ్టన్: శనివారం తెల్లవారుజామున వెనుజులాపై అమెరికా సైనిక బలగాలు మెరుపుదాడి చేశాయి. దేశ రాజధాని కారకాస్‌లోని కీలక సైనిక స్థావరాలపై దాడులు జరిపి, అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్య సిలియా ఫ్లోర్స్‌ను బంధించాయి. ఈ ఆపరేషన్‌ను స్వయంగా ధ్రువీకరించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, వారిని విచారణ కోసం న్యూయార్క్‌కు తరలిస్తున్నట్లు ప్రకటించారు. దశాబ్దాలుగా రెండు దేశాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో, ఈ సైనిక చర్యకు దారితీసిన బలమైన కారణాలను అమెరికా ముందుంచింది. అమెరికా న్యాయ విభాగం ప్రకారం, వెనెజులా అధ్యక్షుడు మదురో కేవలం ఒక రాజకీయ నాయకుడు మాత్రమే కాదు, ఒక శక్తివంతమైన డ్రగ్స్ ముఠాకు నాయకుడు. వెనుజులాపై దాడికి అమెరికా చెబుతున్న అత్యంత కీలకమైన కారణం నార్కో-టెర్రరిజం. నికోలస్ మదురో ప్రభుత్వం డ్రగ్స్ మాఫియాకు అండగా నిలుస్తోందని, మాదకద్రవ్యాలను ఒక ఆయుధంగా ఉపయోగించి అమెరికాను దెబ్బతీయాలని చూస్తోందని ట్రంప్ ప్రభుత్వం చాలాకాలంగా ఆరోపిస్తోంది. దీనికి బలం చేకూరుస్తూ న్యూయార్క్ సదరన్ డిస్ట్రిక్ట్ కోర్టులో మదురోపై నమోదైన అభియోగాలను తెరపైకి తెచ్చింది. 2020లోనే మదురోపై డ్రగ్స్ రవాణా, నార్కో-టెర్రరిజం కుట్ర వంటి అభియోగాలు నమోదయ్యాయి. తాజాగా నేడు (జనవరి 3న) ఆ అభియోగపత్రాన్ని సవరించి, అందులో మదురో భార్య సిలియా ఫ్లోర్స్, ఆయన కుమారుడి పేర్లను కూడా చేర్చారు. కార్టెల్ డి లాస్ సోల్స్ అనే పేరుతో వెనుజులా సైన్యంలోని ఉన్నతాధికారులు నడిపే డ్రగ్స్ ముఠాకు మదురో నాయకత్వం వహిస్తున్నారని అమెరికా ఆరోపిస్తోంది. కొలంబియాకు చెందిన ఫీూ=జ గెరిల్లా సంస్థతో కలిసి అమెరికాకు టన్నుల కొద్దీ కొకైన్ సరఫరా చేస్తున్నారని, దేశాన్ని డ్రగ్స్ రవాణాకు కేంద్రంగా మార్చారని అభియోగాల్లో పేర్కొన్నారు.

### చర్యలకు ముందు వ్యూహాత్మక అడుగులు

ఈ దాడి ఆకస్మికంగా జరిగింది కాదు. గత కొన్ని నెలలుగా కరీబియన్ సముద్రంలో అమెరికా తన నౌకాదళాన్ని భారీగా మోహరించింది. డ్రగ్స్ రవాణా చేస్తున్న పడవలపై 30కి పైగా దాడులు చేసి, 110 మందికి పైగా స్మగ్లర్లను హతమార్చింది. వెనుజులాకు చెందిన ట్రెన్ డి అరాగువా వంటి సంస్థలను టెర్రరిస్ట్ ఆర్గనైజేషన్లుగా ప్రకటించింది. మదురో తలకు 50 మిలియన్ డాలర్ల రివార్డును కూడా గతంలోనే ప్రకటించింది. అమెరికాను పట్టిపీడిస్తున్న ఫెంటనైల్ సంక్షోభానికి, సరిహద్దుల్లో పెరిగిన వలసలకు మదురో ప్రభుత్వమే కారణమని బలంగా వాదిస్తోంది.

### పనామా ఆపరేషన్ పునరావఅతం

చట్టపరంగా చూస్తే, ఈ చర్య 1989లో పనామా పాలకుడు మాన్యువల్ నొరెగాను బంధించిన ఆపరేషన్‌ను పోలి ఉంది. నొరెగాపై కూడా డ్రగ్స్ రవాణా ఆరోపణలతోనే అమెరికా సైనిక చర్యకు దిగింది. ఒక దేశాధినేతకు ఉండే దౌత్యపరమైన రక్షణ ఇలాంటి తీవ్రమైన నేరారోపణల విషయంలో వర్తించదని అమెరికా వాదిస్తోంది. నొరెగా కేసులో వచ్చిన తీర్పునే ఇప్పుడు మదురో విషయంలోనూ చట్టపరమైన ఆధారంగా చూపుతోంది. మొత్తంమీద, దశాబ్దాలుగా ఉన్న రాజకీయ వైరుధ్యాలకు తోడు, డ్రగ్స్ రవాణా, నార్కో-టెర్రరిజం వంటి తీవ్రమైన ఆరోపణలను చట్టపరమైన కవచంగా వాడుకుని అమెరికా ఈ సాహసోపేత సైనిక చర్యకు దిగింది. ఈ ఘటనతో వెనుజులా భవిష్యత్తు, లాటిన్ అమెరికా రాజకీయాలు తీవ్ర అనిశ్చితిలో పడ్డాయి.



## బందీగా మదురో

### తొలి ఫొటో విడుదల చేసిన ట్రంప్

కారకాస్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమ సైన్యం చేతచిక్కిన వెనెజులా అధ్యక్షుడు నికోలస్ మదురోకు సంబంధించిన ఒక ఫొటోను తన 'ట్రూత్ సోషల్' ప్లాట్‌ఫామ్‌లో విడుదల చేశారు. కళ్లకు గంతలు కట్టి, చేతులు కట్టేసి ఉన్న మదురో... యూఎస్ నేవీకి చెందిన యుద్ధనౌక యూఎస్ఎస్ ఐవో జిమాపై ఉన్నట్లు ఆ ఫొటోలో కనిపిస్తోంది. "నికోలస్ మదురో యూఎస్ఎస్ ఐవో జిమా నౌక పై ఉన్నాడు" అని ట్రంప్ ఆ ఫొటోకు క్యాప్షన్ ఇచ్చారు. వెనిజులా రాజధాని కారకాస్‌లో అమెరికా సైన్యం భారీ సైనిక ఆపరేషన్ నిర్వహించి మదురోను, ఆయన భార్య సిలియా ఫ్లోరెస్‌ను అదుపులోకి తీసుకోవడం తెలిసిందే. ఈ ఆపరేషన్‌లో యూఎస్ ఆర్మీకి చెందిన 'డెల్టా ఫోర్స్' కీలక పాత్ర పోషించింది. ఈ ఆపరేషన్ వివరాలను ఫాక్స్ & ఫ్రెండ్స్ కార్యక్రమంలో ట్రంప్ పంచుకున్నారు. కొంతమంది అమెరికా సైనికులు గాయపడ్డారని, అయితే ప్రాణనష్టం జరగలేదని ఆయన తెలిపారు. నార్కో-టెర్రరిజం, డ్రగ్ ట్రాఫికింగ్ ఆరోపణల కింద మదురో దంపతులు న్యూయార్క్‌లో విచారణ ఎదుర్కోనున్నట్లు తెలుస్తోంది. ఈ ఆపరేషన్ సమయంలో కారకాస్‌లో భారీ పేలుళ్లు, తక్కువ ఎత్తులో విమానాల సంచారంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ఇది అమెరికా దురాక్రమణేనని వెనిజులా ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఈ అనూహ్య పరిణామంపై అంతర్జాతీయంగా మిశ్రమ స్పందనలు వ్యక్తమవుతున్నాయి.



## లైవ్‌లో వీక్షించా

వాషింగ్టన్: వెనెజులాలో అమెరికా సైన్యం సంచలన సైనిక చర్య చేపట్టింది. ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్య సిలియా ఫ్లోరెస్‌ను అదుపులోకి తీసుకుంది. ఈ ఆపరేషన్‌ను తాను మార్-ఎ-లాగో విడిది నుంచి ప్రత్యక్షంగా వీక్షించానని, ఇది వేగంగా, కచ్చితత్వంతో పూర్తి చేసిన ఒక అద్భుతమైన మిషన్ అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అభివర్ణించారు. ఆపరేషన్ జరిగిన కొద్ది గంటల తర్వాత ఫాక్స్ అండ్ ఫ్రెండ్స్ వీకెండ్ కార్యక్రమంతో మాట్లాడుతూ ఆయన ఈ వివరాలు వెల్లడించారు. "అమెరికా సైనికులు చేసిన పని అమోఘం. సెకన్ల వ్యవధిలోనే ఉక్కు తలుపులను పగలగొట్టడం నేను ఎప్పుడూ చూడలేదు" అని ట్రంప్ తెలిపారు. ఈ ఆపరేషన్‌లో అమెరికా సైనికులు ఎవరూ చనిపోలేదని, అయితే ఒక హెలికాప్టర్‌పై దాడి జరగడంతో కొందరు గాయపడి ఉండవచ్చని ఆయన సూచనప్రాయంగా చెప్పారు. మదురో దంపతులను హెలికాప్టర్‌లో కరేబియన్‌లోని యూఎస్ఎస్ ఇవో జిమా యుద్ధనౌకకు, అక్కడి నుంచి న్యూయార్క్‌కు తరలిస్తున్నట్లు ఆయన ధఅవీకరించారు. మాదకద్రవ్యాల సంబంధిత నేరాలతో సహా పలు తీవ్రమైన ఆరోపణలపై మదురో దంపతులపై న్యూయార్క్‌లో ఇప్పటికే అభియోగాలు నమోదయ్యాయని అటార్నీ జనరల్ పామ్ బాండీ స్పష్టం చేశారు. ఫాక్స్ న్యూస్ కథనం ప్రకారం, సోమవారం నాటికి మదురోను మాన్‌హట్టన్‌లోని ఫెడరల్ కోర్టులో హాజరుపరిచే అవకాశం ఉంది. సీఐఏ అందించిన సమాచారంతో యూఎస్ ఆర్మీ డెల్టా ఫోర్స్ బలందాలు ఈ రహస్య స్నాచ్ అండ్ గ్రాబ్ మిషన్‌ను పూర్తి చేసినట్లు తెలుస్తోంది.

## అమెరికా చర్య ప్రమాదకరం: యూఎన్

జెనీవా: వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా సైన్యం బందీగా పట్టుకోవడంపై ఐక్యరాజ్యసమితి (ఐరాస) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అమెరికా చేపట్టిన ఈ సైనిక చర్య ప్రమాదకరమైన సంప్రదాయానికి దారితీస్తుందని యూఎన్ సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్ హెచ్చరించారు. ఈ పరిణామం అంతర్జాతీయ చట్టాలను గౌరవించకపోవడమేనని ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. శనివారం తెల్లవారుజామున అమెరికాకు చెందిన డెల్టా దళాలు వెనిజులాలోని ఒక సైనిక స్థావరంపై దాడి చేశాయి. ఈ ఆపరేషన్‌లో అధ్యక్షుడు మదురోతో పాటు ఆయన భార్య సిలియా ఫ్లోరెస్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారిని ఒక యుద్ధనౌకలో న్యూయార్క్‌కు తరలిస్తున్నట్లు అమెరికా అధికారులు తెలిపారు. మదురోపై న్యూయార్క్‌లోని ఫెడరల్ కోర్టులో నార్కో-టెర్రరిజం ఆరోపణలపై కేసులు నమోదయ్యాయి. ఈ ఘటనపై యూఎన్ సెక్రటరీ జనరల్ ప్రతినిధి స్టీఫెన్ డుజారిక్ ఒక ప్రకటన విడుదల చేశారు. "అంతర్జాతీయ చట్టాలను, యూఎన్ చార్టర్‌ను అందరూ తప్పక గౌరవించాలి. కానీ ఇక్కడ ఆ నియమాలను ఉల్లంఘించడంపై సెక్రటరీ జనరల్ తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ చర్య ఆ ప్రాంతంపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది" అని పేర్కొన్నారు. మానవ హక్కులు, చట్టబద్ధ పాలనను గౌరవిస్తూ చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని గుటెర్రస్



పిలుపునిచ్చినట్లు తెలిపారు. మరోవైపు, మదురో అరెస్ట్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. "వారిని ఒక నౌకలో న్యూయార్క్‌కు తరలిస్తున్నాం. హెలికాప్టర్‌లో మంచి ప్రయాణం చేశారని అనుకుంటున్నా" అని ఫాక్స్ న్యూస్‌తో వ్యాఖ్యానించారు.

# సౌదీ వర్సెస్ యూఏఈ

### యెమెన్ కేంద్రంగా ఉద్రిక్తతలు

### అట్టుడుకుతున్న పశ్చిమాసియా

### ఇప్పటికే ఇజ్రాయెల్, గాజా, ఇరాన్‌లో దారుణ పరిస్థితులు



న్యూఢిల్లీ: ఇప్పటికే గాజా-ఇజ్రాయెల్ యుద్ధంతో పశ్చిమాసియా అట్టుడుకుతోంది. ఆ ఉద్రిక్తతలు కాస్త తగ్గుతున్నాయనుకున్న సమయంలోనే కొత్త సంవత్సరంలో మరోసారి మధ్యప్రాచ్యం వేడెక్కుతోంది. ఈసారి రెండు శక్తిమంతమైన గల్ఫ్ దేశాలైన సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) మధ్య పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఇప్పటికే ఇరాన్‌లో జరుగుతున్న నిరసనలు ఒక వైపు ఉండగా, మరోవైపు యెమెన్ అంశం గల్ఫ్ దేశాల మధ్య చిచ్చు పెట్టింది. ప్రస్తుతం యెమెన్‌లో రెండు వర్గాల మధ్య తీవ్ర స్థాయిలో పోరాటం కొనసాగుతోంది. ఈ రెండు వర్గాలకు వేర్వేరు గల్ఫ్ దేశాలు మద్దతు ఇవ్వడంతో పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారింది. యెమెన్ ప్రభుత్వానికి చెందిన ఇంటర్నేషనల్లీ రికగ్నైజ్డ్ గవర్నమెంట్ (ఐఆర్‌జీ)కి సౌదీ అరేబియా మద్దతు ఇస్తుండగా, సదరన్ ట్రాన్సిషనల్ కౌన్సిల్ (ఎస్టీసీ)కి యూఏఈ అండగా నిలుస్తోంది. ఈ క్రమంలో యూఏఈ మద్దతుగల దళాలపై సౌదీ అరేబియా దాడులు చేయడంతో పరిస్థితి ఒక్కసారిగా ముదిరింది. ఈ దాడుల్లో ఎస్టీసీకి చెందిన పలువురు యోధులు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. యెమెన్‌లోని దక్షిణ, తూర్పు ప్రాంతాలను ప్రస్తుతం ఐఆర్‌జీ పరిపాలిస్తోంది. అయితే ఈ సంకీర్ణ ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉన్న ఎస్టీసీ స్వతంత్ర దక్షిణ యెమెన్ ఏర్పాటు లక్ష్యంగా ముందుకు సాగుతోంది. డిసెంబరు నెల నుంచి ఎస్టీసీ కీలక ప్రాంతాలను ఆక్రమించడం ప్రారంభించింది. ముఖ్యంగా హద్రామావత్, అల్-మరాహ్ వంటి ఇంధన వనరులు ఉన్న ప్రాంతాలను తన అధీనంలోకి తీసుకోవడంతో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. యెమెన్ సమైక్యంగా ఉండాలన్నది సౌదీ అరేబియా ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. అయితే ఎస్టీసీ స్వతంత్ర ప్రాంతం కోసం చేస్తున్న ప్రయత్నాలు సౌదీకి అంగీకారంగా లేవు. ఈ నేపథ్యంలోనే యూఏఈ మద్దతుతో ముందుకు వెళ్తున్న ఎస్టీసీపై సౌదీ అరేబియా సైనిక చర్యలకు దిగినట్లు విశ్లేషకులు చెబుతున్నారు. ఇరు దేశాలు ప్రత్యక్షంగా యుద్ధంలోకి దిగకపోయినా, ప్రతినిధి బలగాల ద్వారా ఒకరిపై ఒకరు ప్రభావం చూపే ప్రయత్నం చేస్తున్నాయి. మొత్తంగా చూస్తే, యెమెన్ సంక్షోభం ఇప్పుడు సౌదీ అరేబియాఉ యూఏఈ సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. గాజా యుద్ధం తర్వాత కాస్త శాంతిగా ఉందనుకున్న పశ్చిమాసియా, ఈ తాజా పరిణామాలతో మళ్లీ అగ్నిగుండంగా మారే ప్రమాదం కనిపిస్తోంది.

# ఎస్పీ సస్పెండ్.. ఆత్మహత్యాయత్నం

### బళ్లారిలో కాల్పుల ఘటన

### ఘటన స్థలికి వెళ్లలేదంటూ బళ్లారి ఎస్పీపై వేటు

### మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నం చేసిన ఎస్పీ

బళ్లారి: కర్ణాటకలో సంచలనం సఅష్టించిన బళ్లారి కాల్పుల ఘటనలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ సస్పెన్షన్‌కు గురైన జిల్లా ఎస్పీ పవన్ నెజ్జూర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం తనను సస్పెండ్ చేయడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన, తుమకూరు జిల్లాలోని తన స్నేహితుడి ఫామ్‌హౌస్‌లో నిద్రమాత్రలు మింగినట్లు సమాచారం. ప్రస్తుతం ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, ప్రాణాపాయం నుంచి బయటపడ్డారని పోలీసు వర్గాలు వెల్లడించాయి. జనవరి 1న బళ్లారిలో జరిగిన హింసాత్మక ఘటనకు కేవలం రెండు గంటల ముందే పవన్ నెజ్జూర్ జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించడం గమనార్హం. 11 ఏళ్ల సర్వీసులో ఆయనకు ఇదే తొలి ఎగ్జిక్యూటివ్ పోస్టింగ్. ఈ ఘటనలో ఓ కాంగ్రెస్ కార్యకర్త మరణించడంతో, ప్రభుత్వం ఆయనపై నిర్లక్ష్యం ఆరోపణలతో వేటు వేసింది. ఈ పరిణామంపై ప్రతిపక్ష బీజేపీ తీవ్రంగా స్పందించింది. కాంగ్రెస్ సర్కార్ ఒక హంతక ప్రభుత్వంగా మారిందని ప్రతిపక్ష నేత ఆర్. అశోక ధ్వజమెత్తారు. "రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయి. ఈ ఘటనలో ఎస్పీని బలిపశువును చేశారు. బళ్లారిలో ఎమ్మెల్యే జనార్దన్ రెడ్డిని హత్య చేసేందుకు కాంగ్రెస్ కార్యకర్తలే ప్రయత్నించి, తమ సొంత కార్యకర్తనే కాల్చి చంపుకున్నారు. అధికారులపై ఒత్తిడి పెంచి వారి ఆత్మహత్యలకు ఈ ప్రభుత్వం కారణమవుతోంది. ఇది ఆత్మహత్య గ్యారెంటీ ఇచ్చే ప్రభుత్వం" అని అశోక తీవ్ర విమర్శలు చేశారు. అయితే, ఎస్పీ సస్పెన్షన్‌ను కర్ణాటక ప్రభుత్వం సమర్థించుకుంది. ఘటనా స్థలానికి వెంటనే వెళ్లడంలో ఎస్పీ విఫలమయ్యారని, అందుకే ఆయనపై చర్యలు తీసుకున్నామని న్యాయశాఖ మంత్రి హెచ్.కె. పాటిల్ తెలిపారు. "బాధ్యతలు స్వీకరించిన 30 నిమిషాలైనా సరే, ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు అధికారి వెంటనే స్పందించాల్సి ఉంటుంది" అని ఆయన స్పష్టం చేశారు.

## బంగ్లాదేశ్‌లో హిందూ వ్యాపారి హత్యా

ఢాకా: బంగ్లాదేశ్‌లోని షరియత్‌పూర్ జిల్లా, క్యూర్‌బంగా బజార్‌లో ఫార్మసీ నిర్వహిస్తున్న హిందూ వ్యాపారి ఖోకన్ చంద్ర దాస్, ఢాకాలోని నేషనల్ బర్న్ ఇన్‌స్టిట్యూట్‌లో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మరణించారు. ఇటీవల ఖోకన్ చంద్ర దాస్‌పై కొందరు దుండగులు దాడి చేసి నిప్పంటించగా, వారి నుంచి తప్పించుకునేందుకు ఆయన చెరువులో దూకారు. పోలీసులు, స్థానికులు ఆయనను ఆసుపత్రిలో చేర్పించారు. చంద్రదాస్ క్యూర్‌బంగా బజార్‌లో ఔషధాలు, మొబైల్ బ్యాంకింగ్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. దుకాణం మూసి ఆటోలో ఇంటికి వెళుతుండగా, మార్గమధ్యంలో కొందరు దుండగులు ఆటోను ఆపి, పదునైన ఆయుధాలతో ఆయనపై దాడి చేశారు. అనంతరం ఆయన తలపై పెట్రోల్ పోసి నిప్పంటించగా, వారి నుంచి తప్పించుకునేందుకు ఖోకన్ రోడ్డు పక్కనే ఉన్న చెరువులోకి దూకారు. స్థానికులు ఆయనను కాపాడి ఆసుపత్రికి తరలించారు. విద్యార్థి నాయకుడు ఉస్మాన్ హాదీ హత్యతో దేశంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో హిందువులపై హత్యాకాండా సాగుతోంది.

## బెంగళూరులో ఇళ్ల కూల్చివేతలు కరెక్టే

### కర్ణాటక ప్రభుత్వాన్ని సమర్థించిన శశిథరూర్

బెంగళూరు: బెంగళూరులో కర్ణాటక ప్రభుత్వం చేపట్టిన ఇళ్ల కూల్చివేతలపై కాంగ్రెస్ పార్టీకి చెందిన తిరువనంతపురం ఎంపీ శశిథరూర్ స్పందించారు. ఉత్తర బెంగళూరులోని కోగిలు ప్రాంతంలోని వసీ లేఅవుట్, ఫకీర్ కాలనీలలో ప్రభుత్వం ఇళ్ల కూల్చివేత కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కూల్చివేతలను శశిథరూర్ సమర్థించారు. ఇవి చట్టపరమైన విధానాలకు లోబడే జరుగుతున్నాయని, నిర్వాసితులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా ప్రభుత్వం చేస్తుందని ఆయన వెల్లడించారు. కూల్చివేతకు గురైన ఇళ్లు ప్రభుత్వ భూముల్లో నిర్మించారని ఆయన తెలిపారు. అక్కడ నివసిస్తున్న ప్రజలు చట్టవిరుద్ధంగా ఉంటున్నారని ఆయన స్పష్టం చేశారు. ఆ భూములు ప్రభుత్వానికి చెందినవని, అంతేకాకుండా అది వ్యర్థాలను పారవేసే ప్రాంతమని, అక్కడ అక్రమంగా ఇళ్లు నిర్మించారని ఆయన పేర్కొన్నారు. విషపూరిత వ్యర్థాలు అక్కడి జలాలను కలుషితం చేయడం వల్ల అది ఎంత మాత్రం సురక్షితం కాదని అన్నారు. నివసించడానికి ఆ ప్రాంతం ఏమాత్రం అనుకూలం కాదని థరూర్ తెలిపారు. కూల్చివేతలకు సంబంధించి అక్కడు నివసిస్తున్న వారికి ముందుగానే నోటీసులు జారీ చేసినట్లు ఆయన వెల్లడించారు. నిర్వాసితులకు ప్రత్యామ్నాయ గఅహాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కూల్చివేతల వల్ల పేద ప్రజలకు అన్యాయం జరుగుతోందనే ప్రచారాన్ని ఆయన ఖండించారు. ఇందులో ఎలాంటి రాజకీయ ఉద్దేశాలు లేవని ఆయన స్పష్టం చేశారు. ఈ అంశాన్ని పేదరికం కోణంలో చూడవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇది పూర్తిగా భూ యాజమాన్య హక్కులు, ప్రజల భద్రతకు సంబంధించిన అంశమని ఆయన నొక్కి చెప్పారు.

## విజయ్-రాహుల్ గాంధీ మిత్రులు

### టీవీకే పార్టీ అధికార ప్రతినిధి వెల్లడి

### టీవీకే, కాంగ్రెస్ కూటమి పొత్తుకు సంకేతాలు

చెన్నై: తమ పార్టీ అధినేత, నటుడు విజయ్, కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ మంచి మిత్రులని టీవీకే పార్టీ జాతీయ అధికార ప్రతినిధి ఫెలిక్స్ గెరాల్డ్ తెలిపారు. రానున్న తమిళనాడు శాసనసభ ఎన్నికల్లో టీవీకే, కాంగ్రెస్ కూటమి ఏర్పాటుకు కసరత్తులు జరుగుతున్నాయని, ఇందుకోసం కాంగ్రెస్ అగ్రనేతలతో టీవీకే అధ్యక్షుడు విజయ్ చర్చిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఫెలిక్స్ గెరాల్డ్ మాట్లాడుతూ కాంగ్రెస్‌తో పొత్తుకు సంకేతాలు ఇచ్చారు. లౌకికవాదం, మతతత్వానికి వ్యతిరేకంగా చేసే పోరాటంలో టీవీకే, కాంగ్రెస్ పార్టీ విధానాలు ఒకే విధంగా ఉంటాయని అన్నారు. ఆ కోణంలో చూస్తే తాము భాగస్వాములమని అన్నారు. విజయ్, రాహుల్ గాంధీ కూడా మంచి మిత్రులని పేర్కొన్నారు. కాంగ్రెస్, టీవీకే పొత్తుకు చాలా అవకాశాలు ఉన్నప్పటికీ, ఇరువర్గాలు కొన్ని విషయాలపై చర్చించాల్సిన అవసరం ఉందని అన్నారు. పొత్తు ప్రతిష్ఠంభనకు తమిళనాడు కాంగ్రెస్ పార్టీయే కారణమని అన్నారు. ఇక్కడి నేతలు తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం టీవీకేతో కలవడానికి వెనుకడుగు వేస్తున్నారని ఆరోపించారు. ఇరుపార్టీల మధ్య పొత్తు కుదిరితే మైనారిటీ, బీజేపీ వ్యతిరేక ఓట్లు చీలిపోకుండా కాపాడుకోవచ్చని అన్నారు.

## రోడ్డు విస్తరణలో మా మామ ఇంటినే తొలగించాం: నితిన్ గడ్కరీ



న్యూఢిల్లీ: గతంలో ఒకసారి రోడ్డు విస్తరణ పనులు చేపట్టినప్పుడు అడ్డుగా ఉన్న తన సొంత మామ ఇంటిని సైతం తొలగించినట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు. పని విషయంలో తనకు అందరూ సమానమేనని ఆయన స్పష్టం చేశారు. ప్రముఖ బాలీవుడ్ కొరియోగ్రాఫర్ ఫరా ఖాన్ యూట్యూబ్ వ్లాగ్‌లో కేంద్రమంత్రి ఈ విషయాలు తెలిపారు. తన కుక్ దిలీప్‌తో కలిసి ఫరా ఖాన్ ఢిల్లీలోని గడ్కరీ నివాసాన్ని సందర్శించారు. గడ్కరీ తన భార్య కాంచన్‌తో కలిసి ఫరా ఖాన్ వ్లాగ్‌లో పాల్గన్నారు. తన గ్రామంలో రోడ్డు వేయాలని ఫరా ఖాన్ కుక్ దిలీప్ వ్లాగ్‌లో కేంద్రమంత్రిని అభ్యర్థించారు. దీంతో అతడి ఇంటి మీదుగా రోడ్డు వేయాలని ఫరా ఖాన్ చమత్కరించారు. ఈ సమయంలో అక్కడే ఉన్న కాంచన్ మాట్లాడుతూ, రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉందని తన తండ్రి ఇంటిని గడ్కరీ కూల్చివేశారని వెల్లడించడంతో వారంతా ఆశ్చర్యపోయారు. మీ మామకు కొత్త ఇల్లు కట్టించి ఇచ్చారా అని ఫరా ఖాన్ గడ్కరీని అడగగా, రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా తన మామ ఇంటిని కూల్చివేయవలసి వచ్చిందని ఆయన బదులిచ్చారు. ఇల్లు కోల్పోయిన వారికి ప్రభుత్వం నుంచి అందే పరిహారం అందేలా చూశామని చెప్పారు.

## కుతుబ్ మినార్ కాదు.. వేదశాల

### భారత పురావస్తు సర్వే మాజీ శాస్త్రవేత్త ధరమ్ వీర్ శర్మ

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని చారిత్రక కట్టడం కుతుబ్ మినార్ వాస్తవానికి వేదశాల అని భారత పురావస్తు సర్వే మాజీ ప్రాంతీయ డైరెక్టర్ ధరమ్ వీర్ శర్మ అన్నారు. ఖగోళ శాస్త్రాన్ని అధ్యయనం చేయడం కోసం నిర్మించిన ఒక అబ్జర్వేటరీ అని అభిప్రాయపడ్డారు. ఢిల్లీలో జరుగుతున్న శబ్దోత్సవ్-2026 కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, కుతుబ్ మినార్‌ను వేదశాల అనడానికి ఆధారాలు, కారణాలు ఉన్నాయని అన్నారు. ఒక స్మారక చిహ్నం, ఆలయం లేదా భవనం నిర్మించినప్పుడు ఒక ప్రణాళిక, ఉద్దేశం ఉంటుందని ఆయన అన్నారు. ఇది వఅత్తాకార నిర్మాణం కాబట్టి సహజంగా పునాది కూడా వఅత్తాకారంగానే ఉండాలని అన్నారు. కానీ కుతుబ్ మినార్ పునాది దీర్ఘచతురస్రాకారంగా ఉంటుందని తెలిపారు. ఈ చారిత్రక కట్టడంపై రెండేళ్లు పరిశోధనలు చేశామని, నిర్మాణానికి సంబంధించిన అనేక కొత్త విషయాలను గుర్తించామని అన్నారు. అవి డాక్యుమెంట్ రూపంలో లేవని చెప్పారు. భవనం నిర్మాణం వెనుక కూడా శాస్త్రీయత దాగి ఉందని అన్నారు. సంవత్సరంలో లాంగెస్ట్ డే జూన్ 21న సూర్యుడు దక్షిణాయనంలోకి వచ్చాడని, కుతుబ్ మినార్ నీడ అరగంట పాటు నేలపై పడలేదని ఆయన అన్నారు. ఇవన్నీ ఈ కుతుబ్ మినార్ ఒక వేదశాల అని చెప్పడానికి రుజువులని పేర్కొన్నారు. భారత్‌పై దాడులకు పాల్పడిన విదేశీ పాలకులు దీనిని నాశనం చేశారని పేర్కొన్నారు. ఆ తర్వాత దీనిని తమకు అనుగుణంగా కుతుబ్ మినార్‌గా మార్చుకున్నారని తెలిపారు.

## 6 కిలోమీటర్లు నడిచిన గర్భిణి

### అస్వస్థతకు గురై.. గడ్చిరోలిలో విషాదం

గడ్చిరోలి: మహారాష్ట్రలోని గడ్చిరోలిలో విషాదం చోటుచేసుకుంది. ప్రసవం కోసం కాలినడకన ఆసుపత్రికి బయలుదేరిన నిండు గర్భిణి మఅత్యువాత పడింది. రోడ్డు మార్గంలేక ఆరు కిలోమీటర్లు నడవడంతో రక్తస్రావం జరిగి కడుపులోని బిడ్డ, హైబీపీ కారణంగా తల్లి చనిపోయారు. ఈ విషాదకర సంఘటనకు సంబంధించిన వివరాలు.. గడ్చిరోలి జిల్లా ఎటపల్లి తాలూకాలోని ఆల్దండి టోలో గ్రామానికి చెందిన ఆశా సంతోష్ కిరంగ (24) నిండు గర్భిణి. మారుమూల ప్రాంతం కావడంతో సరైన వైద్య సదుపాయాలు అందుబాటులో లేవు. దీంతో ఆమె ప్రసవం కోసం పెథాలోని తన సోదరి ఇంటికి బయలుదేరింది. అటవీ మార్గం గుండా భర్తతో కలిసి సుమారు 6 కిలోమీటర్లు నడిచి సోదరి ఇంటికి చేరుకుంది. ఈ క్రమంలో కిరంగకు పురిటి నొప్పులు మొదలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను అంబులెన్స్ లో ఆసుపత్రికి తరలించారు. నడక కారణంగా రక్తస్రావం జరిగి కడుపులో బిడ్డ చనిపోయింది. ఆ తర్వాత హైబీపీ కారణంగా కిరంగ కూడా మరణించింది. కిరంగను కాపాడేందుకు వైద్యులు ఎంతగా ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయిందని జిల్లా ఆరోగ్య అధికారి డాక్టర్ ప్రతాప్ షిండే పేర్కొన్నారు. వైద్య సదుపాయంతో పాటు రవాణా సదుపాయం లేకపోవడం వల్లే కిరంగ మరణించిందని ఆమె కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు. కాగా, కిరంగ మఅతిపై విచారణ జరిపిస్తామని అధికారులు పేర్కొన్నారు.

ప్యారీ చిత్రం



కల్లి సోనియా




## సంక్రాంతి రేసులోకి బాలయ్య!

థియేటర్లలో తాండవం చేసిన అఖండ 2.. ఇక ఓటీటీల్లో తాండవం చేసేందుకు రెడీ అవుతున్నట్లు తెలుస్తోంది. జనవరి 9 నుంచి అఖండ2 నెట్‌ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్ కానుందని వార్తలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి ముందు అనుకున్న డీల్ ప్రకారమైతే అఖండ2 జనవరి 2న ఓటీటీలోకి రావాల్సింది. కానీ సినిమా డిసెంబర్ 5 నుంచి 12కు వాయిదా పడటంతో ఈ డీల్ కూడా జనవరి 9కి మారిందని తెలుస్తోంది. అయితే ఎక్కువగా సంక్రాంతికి తన సినిమాలను రిలీజయ్యేలా చూసుకునే బాలయ్య.. ఈ సంక్రాంతిని మిస్ అయ్యారని ఆయన ఫ్యాన్స్ ఫీలవుతున్న నేపథ్యంలో ఇప్పుడు బాలయ్య కూడా సంక్రాంతి రేసులోకి సర్‌ప్రైజ్ ఎంట్రీ ఇవ్వడం ఆసక్తికరంగా మారింది. ప్రభాస్ రాజా సాబ్, చిరంజీవి మన శంకరవరప్రసాద్ గారు, రవితేజ భర్త మహాశయులకు విజ్ఞప్తి, నవీన్ పోలిశెట్టి అనగనగా ఒక రాజు, శర్వానంద్ నారీ నారీ నడుమ మురారి సినిమాలు సంక్రాంతికి థియేటర్లలో రిలీజవనుండగా, బాలకృష్ణ అఖండ2 సంక్రాంతి కానుకగా ఓటీటీలో రిలీజ్ కానుంది.

## బెల్లంకొండ.. మరో పవర్ఫుల్ లుక్



టాలీవుడ్ యంగ్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కెరీర్ ఇప్పుడు ఫుల్ స్వింగ్ లో ఉంది. నిర్మాత బెల్లంకొండ సురేష్ వారసుడిగా ఎంట్రీ ఇచ్చినా, తనకంటూ ఒక సపరేట్ మాస్ ఇమేజ్ క్రియేట్ చేసుకున్నారు. మధ్యలో ఛత్రపతి హిందీ రీమేక్ కోసం టాలీవుడ్ కి గ్యాప్ ఇచ్చిన బెల్లంకొండ, 2025లో మాత్రం స్ట్రాంగ్ కమ్ బ్యాక్ ఇచ్చారు. ఈ ఒక్క ఏడాదే రెండు సినిమాలతో పలకరించి ఆడియన్స్ కు దగ్గరయ్యారు. 2025 మే నెలలో వచ్చిన భైరవం కమర్షియల్ గా యావరేజ్ అనిపించుకున్నా, నటుడిగా బెల్లంకొండకు మంచి మార్కులు పడ్డాయి. ఆ వెంటనే వచ్చిన హారర్ కామెడీ కిష్కింధపురి మాత్రం బాక్సాఫీస్ దగ్గర మ్యాజిక్ చేసింది. అయితే హ్యాట్రిక్ కొడతాడు అనుకున్న టైమ్ లో టైసన్ నాయుడు సినిమా కాస్త డిలే అయ్యింది. ఈ సినిమాను 2026 సమ్మర్ రేస్ లో దించే ప్లాన్ లో ఉన్నారు. ఇదిలా ఉంటే, బెల్లంకొండ శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా ఒక అదిరిపోయే సర్‌ప్రైజ్ ఇచ్చారు. తన కొత్త సినిమాకు సంబంధించి మరో పోస్టర్ ను రిలీజ్ చేశారు. ఈ సినిమాకు హైందవ అనే పవర్ ఫుల్ టైటిల్ ను ఫిక్స్ చేసిన విషయం తెలిసిందే. పోస్టర్ డిజైన్, టైటిల్ ఫాంట్ చూస్తుంటేనే ఇదొక మిస్టరీ యాక్షన్ సినిమా అని అర్థమవుతోంది.



## హిట్ కోసం శ్రీలీల తంటాలు!



తెలుగు హీరోయిన్ శ్రీలీల లైనప్ ఎలా ఉందన్నది చెప్పాల్సిన పనిలేదు. టాలీవుడ్ సినిమాలకంటే బాలీవుడ్ కీలకంగా భావించి అక్కడే కమిట్ అవుతోంది. ప్రస్తుతం హిందీలో రెండు సినిమాలు.. తెలుగులో ఒక చిత్రం... తమిళ్లో మరో చిత్రంలోనూ నటిస్తోంది. తెలుగులో వచ్చిన కొన్ని అవకాశాలను కాదనుకున్న మాట వాస్తవం. అందుకు కారణాలు అనేకం. కానీ తాజాగా అమ్మడు మనసు మారినట్లు తెలిసింది. భాషతో సంబంధం లేకుండా స్ట్రాంగ్ కంబ్యాక్ అవ్వడమే టార్గెట్ గా పని చేస్తుందని ఆమె సన్నిహితుల నుంచి లీక్ అందింది. మరి తెలుగులో కంబ్యాక్ సాధ్యమేనా? అంటే చేతిలో ఉన్నది ఒకే ఒక్క చిత్రం. అందే ఉస్తాద్ భగత్ సింగ్. ఇందులో అమ్మడు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కి జోడీగా నటిస్తోంది. దర్శకుడు హరీష్ శంకర్ శ్రీలీలను ఎంపిక చేసాడంటే.. ఊరికే తీసుకోడు. ఆమెలో చలకీతనం..ప్రతిభ గుర్తించే ఛాన్స్ ఇచ్చాడు. హరీష్ సినిమాల్లో హీరోయిన్లు కూడా కేవలం గ్లామర్ కే పరిమితం కారు. నటనకు ఆస్కారం ఉంటుంది. హీరోతో కాంబినేషన్ సన్నివేశాలు ఎక్కువగా పెడతాడు. ఆ రకంగా శ్రీలీల పాత్ర పరంగా టెన్షన్ పడాల్సిన పనిలేదు. ఎలాంటి పాత్రలోనైనా ఒదిగిపోయే నటి కాబట్టి ఇచ్చిన పాత్రకు న్యాయం చేస్తుంది. ఈ నేపథ్యంలో శ్రీలీలకు ఉస్తాద్ భగత్ సింగ్ వరకూ ఫేవర్ గా నిలుస్తుందా? లేదా? అన్నది చూడాలి.


## అనగనగ ఒక రాజులో శాన్వీ మేఘన 'విందు'



నవీన్ పోలిశెట్టి హీరోగా, మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా మారి దర్శకత్వంలో తెరకెక్కిన అనగనగ ఓ రాజు కామెడీ ఫ్యామిలీ ఎంటర్టైనర్ సంక్రాంతి సందర్భంగా జనవరి 14న రిలీజ్ కానుంది. రిలీజ్ దగ్గర పడుతున్న నేపథ్యంలో ఇప్పటికే చిత్ర యూనిట్ ప్రమోషన్స్ ను వేగవంతం చేయగా, తాజాగా ఈ సినిమాలో ఐటెమ్ సాంగ్ ఉన్నట్టు వార్తలొస్తున్నాయి. ఈ సినిమాలో ఓ స్పెషల్ సాంగ్ ఉందని, ఆ సాంగ్ లో సౌత్ బ్యూటీ రాశీ ఖన్నా నటించనుందని వార్తలొచ్చాయి. కానీ తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలో ఐటెమ్ సాంగ్ ఉన్న మాట నిజమే కానీ, ముందుగా వార్తలొచ్చినట్టు అందులో రాశీ ఖన్నా కాకుండా, మన తెలుగమ్మాయి శాన్వీ మేఘన కనిపించనుందని తెలుస్తోంది.

## శ్రద్ధా కపూర్ 'గులాబీ' కవితలు

సాహో చిత్రంతో తెలుగు వారికి సుపరిచితమైన నటి శ్రద్ధా కపూర్. ఇటీవల స్త్రీ2 లోను అద్భుత నటనతో ఆకట్టుకుంది. హారర్ సినిమాలో శ్రద్ధా నటనకు మంచి మార్కులే పడ్డాయి. తదుపరి క్రిష్ 4లోను శ్రద్ధా కపూర్ నటించనుంది. ఈ భామ తాజాగా పింక్ ఫ్రాక్ ధరించిన ఓ అందమైన ఫోటోగ్రాఫ్ ని షేర్ చేసి, దాంతో పాటే ఒక కొటేషన్ కూడా ఇచ్చింది. గులాబ్ అంటే గులాబీ, గులాబీలు ఎరుపు, ఎరుపు అంటే లాల్, కానీ గులాబీ అంటే పింక్? సరైన గందరగోళం అని ఒక కవితను రాసింది. అయితే ఈ కవిత్వం పాఠకుల్ని తీవ్ర గందరగోళంలోకి నెట్టింది. శ్రద్ధాను సోషల్ మీడియాల్లో అనుసరిస్తున్న లక్షలాది మంది కన్ఫ్యూజన్ లోకి వెళ్లిపోయారు. ఈ రంగు-పద విరుద్ధతను హైలైట్ చేసిన విధానం ఆకర్షణీయంగా ఉన్నా, శ్రద్ధా లోతైన పరిభాషను అర్థం చేసుకోవడం కుర్రాళ్ల వల్ల కాలేదు. గులాబ్ అనే పువ్వుకు మూలం రోజ్. చాలా గులాబీలు ఎరుపు రంగులో ఉంటాయి... అని కూడా ఇందులో వివరంగా ఉంది. అయితే శ్రద్ధా విసిరిన పజిల్‌ను పూరించడానికి ప్రయత్నించిన అభిమానులు ఇంకా కన్ఫ్యూజన్ లోనే ఉన్నారు.




## తలైవా 173.. క్లారిటీ!

తలైవా 173 డైరెక్టర్ సీటులో ఎవరు కూర్చుంటారు అనే దానిపై సోషల్ మీడియాలో రకరకాల రూమర్స్ హల్చల్ చేశాయి. రోజుకో పేరు తెరపైకి వచ్చింది. రజినీకాంత్ లాంటి మాస్ ఇమేజ్ ఉన్న స్టార్ ని, కమల్ హాసన్ లాంటి క్లాసీ ప్రొడక్షన్ వేల్యూస్ ని బ్యాలెన్స్ చేయగలిగే దర్శకుడు దొరకడం అంత ఈజీ కాదు కాబట్టి ఫ్యాన్స్ కూడా కాస్త కన్ఫ్యూజన్ లోనే ఉన్నారు. అయితే అందరి అంచనాలను తలకిందులు చేస్తూ ఒక యంగ్ డైరెక్టర్ కి ఈ భారీ బాధ్యతను అప్పగించారు. శివకార్తికేయన్ తో డాన్ లాంటి బ్లాక్ బస్టర్ తీసిన సిబి చక్రవర్తి ఇప్పుడు రజినీకాంత్ సినిమాను డీల్ చేయబోతున్నాడు. లేటెస్ట్ గా రిలీజ్ చేసిన పోస్టర్ లో సిబి చక్రవర్తి పేరును అధికారికంగా ప్రకటించారు. సిబి చక్రవర్తి టేకింగ్ మీద, ఆయన నెరేషన్ మీద నమ్మకంతోనే కమల్, రజినీ ఈ బిగ్గెస్ట్ ఛాన్స్ ఇచ్చి ఉంటారని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి. ఇక ఈ సినిమాకు మేజర్ ప్లస్ పాయింట్ రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్. ఆయన మ్యూజిక్ ఉంటే చాలు సినిమాపై హైప్ ఆటోమేటిక్ గా వచ్చేస్తుంది. బ్యాక్ టు బ్యాక్ చార్ట్ బస్టర్స్ ఇస్తున్న అనిరుధ్ ఈ సినిమాకు సంగీతం అందించడం ఫ్యాన్స్ కి పూనకాలు తెప్పించబోతున్నాయి. 2027 సంక్రాంతికి ఈ చిత్రాన్ని రిలీజ్ చేయబోతున్నట్లు పోస్టర్ లో అనౌన్స్ చేశారు.



## రుతురాజ్.. కోహ్లిని మించేశాడు!

టీమిండియా బ్యాటర్ రుతురాజ్ గైక్వాడ్ చరిత్ర సృష్టించాడు. లిస్ట్-ఏ క్రికెట్ చరిత్రలోనే అత్యధిక బ్యాటింగ్ యావరేజ్ కలిగిన బ్యాటర్‌గా నిలిచాడు. ఈ క్రమంలో టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి రికార్డ్‌ను అధిగమించాడు. దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా శనివారం ముంబైతో జరిగిన మ్యాచ్‌లో మహారాష్ట్ర తరఫున బరిలోకి దిగిన రుతురాజ్ గైక్వాడ్.. 52 బంతుల్లో 66 పరుగులు చేయడం ద్వారా ఈ ఫీట్ సాధించాడు. ఈ మ్యాచ్‌తో రుతురాజ్ గైక్వాడ్ లిస్ట్-ఏ క్రికెట్‌లో 57.69 సగటును నమోదు చేశాడు. 2016-17 విజయ్ హజారే ట్రోఫీలో మహారాష్ట్ర తరఫున లిస్ట్-ఏ క్రికెట్‌ను ప్రారంభించిన రుతురాజ్ గైక్వాడ్.. హిమాచల్ ప్రదేశ్‌తో జరిగిన తన తొలి మ్యాచ్‌లోనే శతకంతో చెలరేగాడు. 2022 అక్టోబర్‌లో సౌతాఫ్రికాతో తొలి అంతర్జాతీయ వన్డే ఆడాడు. ఇటీవలే భారత వన్డే జట్టులోకి రీఎంట్రీ ఇచ్చిన రుతురాజ్ గైక్వాడ్.. సౌతాఫ్రికాతో సిరీస్‌లో శతకంతో చెలరేగాడు. శుభ్‌మన్ గిల్ స్థానంలో జట్టులోకి వచ్చిన రుతురాజ్ గైక్వాడ్.. నాలుగో స్థానంలో బ్యాటింగ్ చేశాడు. లిస్ట్-ఏ క్రికెట్‌లో అత్యధిక బ్యాటింగ్ యావరేజ్ కలిగిన బ్యాటర్ల జాబితాలో ఆస్ట్రేలియా బ్యాటర్ మైఖేల్ బెవెన్ అగ్రస్థానంలో ఉన్నాడు. అతను 57.86 సగటుతో 15103 పరుగులు చేయగా.. ఇంగ్లండ్ బ్యాటర్ సామ్ హైన్ 57.76 సగటుతో 3004 పరుగులు చేసి రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. విరాట్ కోహ్లి 57.67 సగటుతో 16207 పరుగులు చేసి నాలుగో స్థానంలో ఉండగా.. రుతురాజ్ గైక్వాడ్ 57.69 సగటుతో 4904 పరుగులు చేసి మూడో స్థానంలో కొనసాగుతున్నాడు.



## శ్రేయస్ రెడీ

భారత వన్డే వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ రీఎంట్రీకి ముహుర్తం ఖరారైంది. ఆస్ట్రేలియా పర్యటనలో ఫీల్డింగ్ చేస్తూ శ్రేయస్ అయ్యర్ తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. అతని పక్కటెముకల్లోని ప్లీహంలో చీలిక రావడంతో పాటు అంతర్గత రక్త స్రావం కావడంతో ఐసీయూలో ఉంచి చికిత్స అందించారు. భారత ఫిజియోల వేగవంతమైన ట్రీట్‌మెంట్‌తో శ్రేయస్ అయ్యర్ ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అనంతరం ఇంటికే పరిమితమైన శ్రేయస్ అయ్యర్.. ఇటీవలే బెంగళూరులోని బీసీసీఐ సెంట్రల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో చేరి ఫిట్‌నెస్‌పై ఫోకస్ పెట్టాడు. ఈ గాయంతో మూడు నెలల పాటు పూర్తిగా ప్రొఫెషనల్ క్రికెట్‌కు దూరమైన శ్రేయస్ అయ్యర్.. విజయ్ హజారే ట్రోఫీతో తిరిగి మైదానంలోకి అడుగుపెట్టనున్నాడు. ఈ టోర్నీలో భాగంగా జనవరి 6న హిమాచల్ ప్రదేశ్‌తో జరిగే మ్యాచ్‌లో ముంబై తరఫున శ్రేయస్ అయ్యర్ బరిలోకి దిగుతాడని బీసీసీఐ సీఓఈకి చెందిన ఓ అధికారి మీడియాకు తెలిపాడు. అయితే, న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో ఆడుతాడా? లేదా అనేది అతని ఫిట్‌నెస్‌పై ఆధారపడి ఉంటుందని చెప్పాడు.



# పాండ్యా, బుమ్రాకు షాక్

## న్యూజిలాండ్ వన్డే సిరీస్‌కు నో చాన్స్.. మహ్మద్ షమీకి మళ్లీ మొండి చేయి



న్యూజిలాండ్‌తో జరగనున్న 3 మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం బీసీసీఐ శనివారం టీమిండియాను ప్రకటించింది. ఈ జట్టులో స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా, స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా పేర్లు లేకపోవడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. అయితే హార్దిక్ ను ఎందుకు ఎంపిక చేయలేదనే విషయంపై బీసీసీఐ స్పష్టతనిచ్చింది. పాండ్యాను వన్డే సిరీస్‌కు దూరం పెట్టడం వెనుక ఉన్న ప్రధాన కారణం ఆయన 'వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్' అని బీసీసీఐ తెలిపింది. ఒక వన్డే మ్యాచ్‌లో హార్దిక్ వరుసగా 10 ఓవర్లు బౌలింగ్ చేసేంత ఫిట్‌నెస్‌తో ప్రస్తుతం లేరని, వైద్య బృందం ఆయనకు పూర్తి స్థాయిలో బౌలింగ్ చేయడానికి అనుమతి ఇవ్వలేదని సమాచారం. 2026లో జరగనున్న ఐసీసీ టీ20 ప్రపంచ కప్‌ను దృష్టిలో ఉంచుకుని, హార్దిక్ కీలక ఆటగాడు కాబట్టి ఆయనపై ఒత్తిడి పడకుండా విశ్రాంతిని ఇచ్చారు. బుమ్రా విషయంలో కూడా ఇదే వ్యూహాన్ని అనుసరించారు. వెన్ను గాయం కారణంగా గత కొంతకాలంగా ఆటకు దూరమైన శ్రేయస్ అయ్యర్ తిరిగి జట్టులోకి వచ్చారు. అంతేకాకుండా ఆయనకు వైస్ కెప్టెన్ బాధ్యతలను కూడా అప్పగించారు. అయితే ఆయన ఆడటం అనేది ఫిట్‌నెస్ రిపోర్టుపై ఆధారపడి ఉంటుంది. సీనియర్ ఆటగాళ్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మలు ఈ వన్డే సిరీస్‌లో భాగమయ్యారు. వెటరన్ పేసర్ మహ్మద్ షమీని మరోసారి సెలక్టర్లు పక్కన పెట్టారు. అలాగే దక్షిణాఫ్రికాపై సెంచరీ చేసిన రుతురాజ్ గైక్వాడ్‌కు కూడా చోటు దక్కలేదు.

భారత జట్టు: శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), శ్రేయస్ అయ్యర్ (వైస్ కెప్టెన్), వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, మహ్మద్ సిరాజ్, హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్, రిషబ్ పంత్ (వికెట్ కీపర్), నితీష్ కుమార్ రెడ్డి, అర్ష్‌దీప్ సింగ్, యశస్వి జైస్వాల్.

## ఒకే ఓవర్లో 6, 6, 6, 6, 6, 4

### రెచ్చిపోయిన పాండ్యా

భారత ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా మరోసారి రెచ్చిపోయాడు. ఈమధ్యే దక్షిణాఫ్రికాపై మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడిన పాండ్యా.. విజయ్ హజారే ట్రోఫీలోనూ పూనకం వచ్చినట్టు చెలరేగాడు. లిస్ట్-ఏ క్రికెట్‌లో విధ్వంసక ఆటతో మొట్టమొదటి సెంచరీ బాదేశాడీ హిట్టర్. బరోడా తరఫున బరిలోకి దిగిన ఈ చిచ్చరపిడుగు విదర్భ బౌలర్లకూ చుక్కలు చూపిస్తూ 68 బంతుల్లోనే శతక గర్జన చేశాడు. హిట్టర్లందు హార్దిక్ పాండ్యా వేరయా అనే మాట మనకు తెలిసిందే. ముఖ్యంగా టీ20లు అంటే చాలు తనలోని విధ్వంసక ఆటగాడిని బయటకు తీసుకొస్తాడీ క్రికెటర్. ఆసియా కప్ తర్వాత సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీతో పునరాగమనం చేసిన అతడు వస్తూ వస్తూనే అర్ధ శతకంతో రెచ్చిపోయాడు. అనంతరం సఫారీలకు తన బ్యాట్ పవర్ చూపించిన పాండ్యా.. ఇప్పుడు విజయ్ హజారే ట్రోఫీలోనూ ఊచకోత కోశాడు. విదర్భ బౌలర్లను హడలెత్తించిన బరోడా స్టార్.. స్పిన్నర్ రెఖాడే వేసిన 39వ ఓవర్లో మరింత రెచ్చిపోయాడు. వరుసగా 6, 6, 6, 6, 6, 4 బాది 34 రన్స్ పిండుకున్నాడు. బంతి గమ్యం బౌండరీయే అన్నట్టుగా విధ్వంసం సృష్టించిన పాండ్యా 68 బంతుల్లోనే సెంచరీ సాధించాడు.

## పడిక్కల్.. సెంచరీల మోత

ఐదు మ్యాచ్‌ల్లో 4 సెంచరీలుదేశవాళీ క్రికెట్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) బ్యాటర్ దేవదత్ పడిక్కల్ దుమ్మురేపుతున్నాడు. ప్రతిష్టాత్మక దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో కర్ణాటకకు ప్రాతినిథ్యం వహిస్తున్న పడిక్కల్.. వరుసగా ఐదు ఇన్నింగ్స్‌ల్లో 4 శతకాలు నమోదు చేశాడు. ఎలైట్ గ్రూప్-ఏలో భాగంగా త్రిపురతో శనివారం అహ్మదాబాద్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో దేవదత్ పడిక్కల్ సెంచరీతో చెలరేగాడు. ఈ మ్యాచ్‌లో ఓపెనర్‌గా



బరిలోకి దిగిన పడిక్కల్ 120 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్‌లతో 108 పరుగులు చేశాడు. లిస్ట్-ఏ క్రికెట్‌లో పడిక్కల్‌కు ఇది 13వ శతకం. పడిక్కల్ శతకానికి తోడుగా రవిచంద్రన్ సమరణ్(60), అభినవ్ హనోహర్(79) హాఫ్ సెంచరీలతో రాణించడంతో భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లకు 332 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్(35) నిరాశపర్చాడు. విజయ్ హజారే ట్రోఫీలో జార్ఖండ్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో 147 పరుగులు చేసిన పడిక్కల్.. కేరళతో 124 పరుగులు చేశాడు. పాండిచ్చేరిపై 113 పరుగులు చేసిన అతను తమిళనాడుపై మాత్రం విఫలమయ్యాడు. ఈ మ్యాచ్‌లో 22 పరుగులే చేశాడు. తాజాగా త్రిపురపై సెంచరీ బాది.. తన నిలకడను చూపించాడు. ఓవరాల్‌గా 5 మ్యాచ్‌ల్లోనే 513 పరుగులు చేసి సెలెక్టర్లకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చాడు.



## షమీ కెరీర్ ముగిసినట్టే?

ఒకప్పుడు భారత జట్టు ప్రధాన పేస్ అస్త్రమైన పేసర్ మహమ్మద్ షమీకి మరోసారి చుక్కెదురైంది. దేశవాళీ క్రికెట్‌లో వికెట్లు తీస్తూ నిలకడగా రాణిస్తున్నా సరే అతడిని సెలెక్టర్లు పట్టించుకోవడం లేదు. న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌కు శనివారం ఎంపిక చేసిన స్క్వాడ్‌లో ఈ స్పీడ్‌స్టర్ పేరు లేదు. జస్ప్రీత్ బుమ్రా గైర్హాజరీలో షమీకి చోటు దక్కుతుందని అందరూ అనుకున్నారు. కానీ, సెలెక్టర్లు మాత్రం మరోసారి ఈ దిగ్గజ బౌలర్‌కు అన్యాయం చేశారు. దాంతో.. ఇక అతడి కెరీర్ ముగిసిందనే వార్తలు వినిపిస్తున్నాయి. ఒకప్పుడు ప్రధాన పేసర్‌గా టీమిండియా విజయాల్లో కీలకమైన షమీ ఇప్పుడు ఒక్క ఛాన్స్ కోసం చకోర పక్షిలా నిరీక్షిస్తున్నాడు. మూడేళ్ల క్రితం వన్డే ప్రపంచకప్‌లో అత్యధిక వికెట్లతో 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు అందుకున్న ఈ వెటరన్ బౌలర్.. జట్టుకు దూరమై రెండేళ్లు అవుతోంది. మోకాలి సర్జరీ నుంచి కోలుకొని ఫిట్‌నెస్ సాధించిన షమీకి సెలెక్టర్లు చుక్కలు చూపిస్తున్నారు. ఇటీవల సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ, విజయ్ హజారే ట్రోఫీలో ఐదు మ్యాచుల్లో 12 వికెట్లతో చెలరేగాడీ స్పీడ్‌స్టర్. దాంతో.. ఐసీసీ టోర్నీల్లో నిప్పులు చెరిగే షమీని వన్డే ప్రపంచకప్ కోసమైనా న్యూజిలాండ్ సిరీస్‌కు ఎంపిక చేస్తాడని ఊహించారంతా. కానీ, బుమ్రా బదులు సిరాజ్‌కు ఓటేసిన సెలెక్టర్లు హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్‌లను తీసుకున్నారు. అంతే.. ఈసారైనా టీమిండియాకు ఆడే అవకాశం వస్తుందని భావించిన షమీ కలలు కల్లలయ్యాయి.

ఈవార్తలు
ప్రజావాణి
సంపాదకీయం
www.evarthalu.com
నేటి ఈవార్తలు
ఆదివారం 4-1-2026





# హిస్టరీ.. మిస్టరీ

## ...తెలంగాణ.. జర దేఖో

శ్రావణ వాణి

కేసీఆర్‌ను ఎంతైనా తిట్టుకోండి..
**అది మీ రాజకీయం**

గెలవనివ్వనని శపథాలు చేయండి..
**అది మీ పంథం**

కేసులు పెట్టి టార్చర్ చేసుకోండి..
**అది మీ వ్యక్తిగతం**

దగ్గరికి వచ్చి దండాలు పెట్టుకోండి..
**అది మీ వ్యక్తిత్వం**

కానీ,
తెలంగాణ నీళ్లు.. నాలుగున్నర కోట్ల మంది అధికారం!
కావాలి ప్రతి ఒక్క ప్రాజెక్టు.. తెలంగాణకు ప్రయోజనం!!

కాళేశ్వరాన్ని ఎందుకు పడావు పెడుతున్నరు?
ఒక పిల్లర్ కూలిపోయిందనా..! పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ఎందుకు ముందుకు సాగుతలేదు?
ఎవరికైనా మేలు చేసేందుకా..!

ఏపీ రాష్ట్ర ప్రయోజనాల విషయంలో చంద్రబాబు, జగన్ వైఖరి ఒక్కటే. తమ రాష్ట్రానికి నీళ్లను తెప్పించుకోవాలి అని. మరి.. తెలంగాణ పాలకులు తెలంగాణ ప్రయోజనాల కోసం ఎందుకు ఆలోచించరు? పక్క రాష్ట్రంతో గొడవలు ఉంటాయని బుకాయిస్తున్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును జూరాల నుండి శ్రీశైలానికి మార్చడం వల్ల తెలంగాణ ప్రయోజనాలు దెబ్బతిన్నాయని, ప్రాజెక్టు అంతరాష్ట్ర వివాదంలో చిక్కుకుందని కాంగ్రెస్ ప్రభుత్వం వాదిస్తోంది. మరి ఏపీ పాలకులు బనకచర్ల విషయంలో అలా ఎందుకు ఆలోచించలేదు? పోతిరెడ్డిపాడు విషయంలో ఎందుకు సోచాయించలేదు? నల్లమలసాగర్ విషయంలో ఎందుకు థింక్ చేయడం లేదు? తెలంగాణతో గొడవలు వస్తాయని ఎందుకు వెనక్కి తగ్గలేదు. ఏపీ వాళ్లవే ప్రయోజనాలా? తెలంగాణకు ప్రయోజనాలు ఉండకూడదా? ఏపీకి అన్యాయం జరుగుతుందని తెలంగాణవాళ్లే తెలంగాణ బిడ్డల కడుపు కొడతారా? ఈ మాత్రం ఇంగితం లేనివాళ్లా తెలంగాణ పాలకులు? తెలంగాణ పాలకులు తెలంగాణ కోసం ఆలోచించాలి. ఆ తర్వాతే వేరేవాళ్ల గురించి. పాలకులు హిస్టరీ క్రియేట్ చేయాలి. చరిత్రలో మిస్టరీగా మారిపోవద్దు. చించేసే పేజీ కావొద్దు. ద్రోణాచార్యుడు కౌరవులు, పాండవులకు గురువు. కానీ, కురుక్షేత్ర యుద్ధంలో కౌరవుల పక్షాన నిలబడ్డాడు. పాండవుల చేతిలో చచ్చాడు.

తెలంగాణ విషయంలోనూ అంతే కావాలి.
రాజకీయ భిక్ష పెట్టినా, రాజ్యాధికారం అప్పగించినా..
గురువు స్థానం అక్కడికే పరిమితం కావాలి.

తెలంగాణ ప్రయోజనాలను బలిపెట్టే గురువును ఆ శిష్యుడు అడ్డుకొని తీరాలి. అదే రాజధర్మం. రాజ్యధర్మం కూడా. తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకొనేందుకు ఏపీ సీఎం చంద్రబాబు కేంద్రానికి 70-80 లేఖలు రాశారని ఒక లెక్క. ఆ లెక్కల మరకల్లో ఏపీ మాజీ సీఎస్ ఆదిత్యనాథ్ దాస్‌కూ హస్తం ఉంది. మరి అలాంటి వ్యక్తికి తెలంగాణ ప్రభుత్వంలో కీలక పదవులెలా ఇస్తారు? పైగా జలవనరుల సలహాదారుగా ఎలా నియమిస్తారు? ఇది తెలంగాణకు చేసిన, చేస్తున్న ద్రోహం కాదా?



శ్రావణ్ కుమార్ బొమ్మకంటి
ఎడిటర్, 9581291919

### 'పాలమూరు'ను పాతరేయాలని చూసిందెవరు?

కాళేశ్వరం ప్రాజెక్టు కంటే ముందే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు పునాది రాయి పడింది. 2015లోనే శంకుస్థాపన జరిగింది. కానీ, కొందరు తెలంగాణ ద్రోహులు ఆ ప్రాజెక్టుపై కేసుల మీద కేసులు వేసి ఆపాలని చూశారు. అవాంతరాలు ఎదురైనా, అప్పటి ప్రభుత్వం అనధికారికంగా పనులను కొనసాగించింది. మరి, బీఆర్ఎస్ చెప్పినట్లు 90 శాతం ప్రాజెక్టు పనులు పూర్తయ్యాయా? అంటే తెల్వదు. కానీ, నార్లాపూర్ పంప్‌హౌజ్‌లో ఇప్పటికే 4 టీఎంసీల నీళ్లు నిల్వ ఉన్నాయి. అంటే.. జూరాల ప్రాజెక్టు పూర్తయితే లభ్యమయ్యే నీటిలో ఒక్క నార్లాపూర్ పంప్‌హౌజ్ వద్దే సగం నీళ్లు రెడీగా ఉన్నాయి. నీళ్లను ఎత్తిపోసేందుకు నాలుగు 145 హార్స్ పవర్ బాహుబలి మోటార్లు కూడా ఉన్నాయి. మొత్తం పూర్తి కాకముందే ఇంత నీటిని స్టోరేజీ చేసుకోగలిగిన ఆ ప్రాజెక్టు.. పూర్తయితే ఎంత భూమి సస్యశ్యామలం అవుతుందో అర్థం చేసుకోలేమా..!

### జూరాల ఎందుకు వద్దంటే..

జూరాల వద్ద పాలమూ రు-రంగారెడ్డి ప్రాజెక్టు కడితే స్టోరేజీ కెపా సిటీ గరిష్ఠంగా 9.6 టీఎంసీలే ఉంటుంది. ఇది ఏ నీళ్ల నిపుణుడిని అడిగినా చెప్తాడు. పైగా ఆ ప్రాజెక్టు 'రన్ ఆఫ్ ది రివర్' (నీరు వచ్చినప్పుడే ఉపయోగించుకోవాలి) ప్రాజెక్టు. గత సీజన్‌లో ఇదే జూరాల ప్రాజెక్టు కింది ఆయకట్టు (దాదాపు 5.5 లక్షల ఎకరాలు)కు క్రాప్ హాలీడే ప్రకటించిన సంగతి తెలిసిందే కదా. అలాంటప్పుడు జూరాల వద్ద ప్రాజెక్టు కడితే నీళ్లు ఎక్కడి నుంచి తేవాలి? ప్రవాహం తక్కువగా ఉంటే నీటి కొరత ఏర్పడితే పరిస్థితి ఏంటి? నీళ్లు లేని చోట ప్రాజెక్టు కట్టడం ఎందుకు? ఇక, శ్రీశైలం బ్యాక్ వాటర్ వద్ద ప్రాజెక్టు కట్టడం వల్ల ఉపయోగమేంటి.. అంటే, స్టోరేజీ కెపాసిటీ, తుంగభద్ర నది ప్రవాహం. ఇవి రెండూ సానుకూలాంశాలే. తలకాయ (జూరాల) వదిలేసి తోక (శ్రీశైలం బ్యాక్ వాటర్) పట్టుకుంటే ఏం లాభం? అని సీఎం రేవంతే స్వయంగా మీడియాతో అన్నారు. నీళ్లు ఎక్కువ ఉన్న చోట ప్రాజెక్టు కడితే లాభం కానీ, నీళ్లు లేని చోట ప్రాజెక్టు కడితే ఏం లాభం? అన్న సంగతి తెలియకపోవడం శోచనీయం.

### శ్రీశైలం వద్ద కడితే లాభమేంటి?

వాస్తవ ధృక్కోణంలో చూస్తే అసలు విషయం తెలుస్తుంది. ఏటా సగటున తుంగభద్ర నది నుంచి కృష్ణా నదిలోకి 699.34 టీఎంసీల నీరు వచ్చి చేరుతుంది. ఇది కేంద్ర జలసంఘం అధికారిక అంచనా. ఈ నీరే శ్రీశైలం ప్రాజెక్టుకు ప్రధాన నీటి వనరు. శ్రీశైలం వద్ద పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు కట్టడానికి అసలు కారణం ఇదే. కృష్ణా నదిలో వరద ఉండే 60 రోజుల పాటు రోజుకు 1.5 టీఎంసీ చొప్పున 90 టీఎంసీల నీటిని ఎత్తిపోసుకునే వెసులుబాటు తెలంగాణకు కలుగుతుంది. శ్రీశైలం వద్ద రిజర్వాయర్ నిల్వ సామర్థ్యం.. 215 టీఎంసీలు. అంటే.. శ్రీశైలం వద్ద ఎక్కువ కాలం నీరు అందుబాటులో ఉంటుంది. దాంతో 12.3 లక్షల ఎకరాలకు సాగునీరు అందించవచ్చు. ఇక, పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు వల్ల కొండగల్ వరకు.. అక్కడి నుంచి చేవెళ్లకు.. అక్కడి నుంచి లిఫ్ట్ ద్వారా హైదరాబాద్ వరకు నీళ్లకు తెప్పించుకోవచ్చు.

### కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నదిదీ..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును అటకెక్కించింది. అవసరమేలేని కొడంగల్-నారాయణపూర్ లిఫ్ట్ అని మొదలుపెట్టింది. అదే పాలమూరు ప్రాజెక్టు పూర్తయ్యి ఉంటే ఈ కొడంగల్ లిఫ్ట్‌తో పనే ఉండకపోయేది. ఆర్నెల్ల క్రితం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రాజెక్టును సందర్శించారు. ఇంకో సంవత్సరంలో ప్రాజెక్టు పూర్తవుతుందని అధికారులు కూడా చెప్పారు. కానీ, ఆ విషయాన్ని ప్రపంచం చెవిన పడనీయలేదు. ఈ ప్రాజెక్టును రూ.35,250 కోట్లతో చేపట్టారు. 2023లో అంచనా వ్యయాన్ని 55,086 కోట్లకు పెంచారు. అందులో.. రూ.27,500 కోట్లు ఖర్చు చేశారని మంత్రి ఉత్తమ్ అన్నారు. 21 ప్యాకేజీలుగా విభజించిన ఈ ప్రాజెక్టులో లిఫ్టులు, రిజర్వాయర్లు, ప్రధాన కాలువలు, సొరంగాలు ఉన్నాయి. రిజర్వాయర్లు, ప్రధాన కాలువ పనుల్లో ఎక్కువ భాగం పనులు కూడా పూర్తయ్యాయి. అంటే.. బీఆర్ఎస్ చెప్పినట్లు 90 శాతం పని పూర్తయ్యిందని అన్నట్లే కదా. ఇప్పుడేమో ఆ ప్రాజెక్టు వ్యయాన్ని రూ.85 వేల కోట్లకు పెంచారు. మిగిలిన 10 శాతం పనులకే రూ.30 వేల కోట్లు అవసరమా?

### నాగార్జున సాగర్‌ను స్వాధీనం చేసుకోలేదెందుకు?

2023 నవంబర్ 30న.. తెలంగాణలో పోలింగ్ జరుగుతున్న రోజు అది.. నాగార్జున సాగర్ వద్ద ఏపీ-తెలంగాణ గొడవ పడ్డాయి. దాంతో సీఐఎస్ఎఫ్ రంగంలోకి దిగాల్సి వచ్చింది. వాస్తవానికి, నాగార్జున సాగర్ బాధ్యత తెలంగాణ సర్కారుది. శ్రీశైలం బాధ్యత ఏపీ సర్కారుది. కానీ.. రెండేళ్లు గడిచినా నాగార్జున సాగర్‌ను తెలంగాణ ప్రభుత్వం ఎందుకు స్వాధీనం చేసుకోలేదు? ఎవరి లబ్ధి కోసం? ఇక్కడో విస్తుపోయే నిజాన్ని తెలంగాణ ప్రజానీకం తెలుసుకోవాలి. నల్లమల సాగర్ విస్తరణ కోసం ఏపీ ప్రభుత్వం కుడి కాల్వను రెండింతలు వెడల్పు చేయ తలపెట్టింది. దాంతో నీళ్లన్నీ అటే ధార కడతాయి. అంటే.. ఎడమ కాల్వ ఎండిపోయి ఖమ్మం, నల్లగొండ జిల్లాలకు చుక్క నీరు లేకుండా అవుతుంది. ఈ వాస్తవం సాధారణ ప్రజలకు ఇప్పుడే అర్థం కాదు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం ఎందుకు అలసత్వం వహిస్తోంది? ఎవరి మెప్పు కోసం?

### బనకచర్ల ఎందుకు ఆగిందో తెలుసా?

ఏపీ చేపట్టిన బనకచర్ల ప్రాజెక్టు ఆగిపోవడంలో, ప్రాజెక్టుపై ఏపీ ప్రభుత్వం వెనక్కి తగ్గడంలో తమ పాత్ర ఉందని పాలకులు డప్పు కొట్టుకుంటున్నారు. కానీ, అసలు వాస్తవం వేరే ఉంది. గోదావరి నీళ్లను కృష్ణా డెల్టాకు తరలిస్తే ఊరుకోబోమని కర్ణాటక, మహారాష్ట్ర తేల్చి చెప్పాయి. బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం ఆ రేషియోలో కృష్ణా నీళ్లను ఆపేస్తామని స్పష్టం చేశాయి. 64 టీఎంసీలు కావాలని కర్ణాటక, 21 టీఎంసీలు కావాలని మహారాష్ట్ర డిమాండ్ చేశాయి. దీంతో.. అసలుకే మోసం వస్తుందని గ్రహించిన ఏపీ ప్రభుత్వం బనకచర్లపై వెనకడుగు వేసింది.

### నల్లమల సాగర్ వెనుక కుట్ర ఇదీ..

పోలవరం ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలను బొల్లపల్లి రిజర్వాయర్‌కు తరలించి, అక్కడి నుంచి కృష్ణా డెల్టాకు తరలించమే లక్ష్యం. అంటే.. గోదావరి నీళ్లను కృష్ణాలో కాకుండా నల్లమల సాగర్‌లో కలపాలనేది చంద్రబాబు నిర్ణయం. అంటే.. ఇక్కడ బచావత్ ట్రిబ్యునల్ నుంచి తప్పించుకోవచ్చన్న మాట. అది జరగాలంటే.. కాళేశ్వరం ప్రాజెక్టు పడావు పడాలి.. అసలు కాళేశ్వరమే లేదనేలా చేయాలి.. 240 టీఎంసీల నీళ్లను తెలంగాణ వాడుకుంటుదన్న విషయాన్ని దాచాలి.. అప్పుడే ఆ నీళ్లను ఏపీకి మళ్లించవచ్చన్నది చంద్రబాబు ప్లాన్. ఆ ప్లాన్‌నే తెలంగాణ పాలకుడు పక్కాగా అమలుచేస్తున్నారని అనిపిస్తోంది.

### కాళేశ్వరం ప్రాజెక్టు పుట్టుక ఇలా..


2016 వరకు కాళేశ్వరం ప్రాజెక్టుకు పురుడుపోయాలన్నది ఆలోచన మాత్రమే. అప్పటి ప్రభుత్వం ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును కొనసాగించేందుకు శతవిధాలా ప్రయత్నించింది. నీళ్ల కోసం మహారాష్ట్రతో ఒప్పందాలు చేసుకోవడానికి సిద్ధమైంది. కానీ, మహారాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరాలు తెలపడంతో కాళేశ్వరం ప్రాజెక్టుకు ముగ్గు పోయాల్సిన అవసరం ఏర్పడింది. ఆ తర్వాత కాళేశ్వరం చరిత్ర 'డిస్కవరీ'కి ఎక్కే అంత గొప్పదైంది. ఇది ఏ పార్టీని మోయడానికో.. ఏ పార్టీని దించేయడానికో చెప్తున్నది కాదు. నీళ్లు లేక తల్లడిల్లిన తెలంగాణ బొండిగకు తెలుసు.. కాళేశ్వరం ముందు, ఆ తర్వాత ఏంటి? అనేది.

### 299 టీఎంసీలకు కేసీఆర్ ఒప్పుకున్నారా?

2013లో ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలుగా నిర్ణయిస్తే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వం తలూపి తెలంగాణకు ద్రోహం చేసింది. అయితే, తెలంగాణ ఏర్పడ్డ 42 రోజులకే 811 టీఎంసీల పునఃపంపిణీ చేయాలని కేసీఆర్ సర్కారు కేంద్రానికి లేఖ రాసింది. 69 శాతం వాటా తెలంగాణకు దక్కాలని తేల్చి చెప్పారు. కేంద్రం స్పందించకపోవడంతో సుప్రీం కోర్టులో కేసు వేసింది. కేంద్రం విజ్ఞప్తితో రాష్ట్ర ప్రభుత్వం కేసును వెనక్కి తీసుకుంది. అయితే, బ్రిజేష్ ట్రిబ్యునల్ ఫైనల్ అవార్డు వచ్చే వరకు 299 టీఎంసీలే దిక్కయ్యాయి. సరిగ్గా 2023 ఎన్నికలకు ముందు కేంద్రం కొత్త ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసింది. కొద్ది కాలానికే ప్రభుత్వం మారిపోయింది.

### తెలంగాణకు మేధావుల మోసం

రాష్ట్రంలో ఇంత జరుగుతున్నా మేధావులు మౌనంగా ఉండటం వల్ల తెలంగాణ భవిష్యత్తు అత్యంత ప్రమాదంలో పడబోతోంది. కేసీఆర్ తప్పు చేశారని ఆనాడు బహిరంగంగానే నిలదీసిన మేధో వర్గం.. నేడు రేవంత్ తప్పుచేస్తుంటే మాత్రం కిక్కురుమనడం లేదు. తెలంగాణకు అన్యాయం జరగడం లేదని వారు అనుకుంటున్నారా? లేక దేనికోసమైనా 'ఆశ'పడి ఆగుతున్నరా? కాంగ్రెస్ సర్కారు ఇంకా మూడేళ్లు అధికారంలో ఉంది.. ఇప్పుడేం అరిచినా ప్రయోజనం ఉండదనేది వారి భావనా? చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు ఎన్నికల వేళ అంతా అయిపోయాక సర్కారును కడిగి పారేద్దామన్న నిర్ణయమా? లేక చివర్లో ప్లేటు ఫిరాయించవచ్చన్న ఎత్తుగడా?



OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.